


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 04-06-2025 | సంపుటి - 24 | సంచిక - 33 | రూ : 4 | పేజీలు : 8




## పంద్రాగస్టు నాటికి భూసమస్యల పరిష్కారం

- ఐపీఎల్ ఫైనల్లో పంజాబ్
- క్వాలిఫయర్ 2లో ముంబయిపై విజయం
- శ్రేయస్ అద్భుత ఇన్నింగ్స్

**జూన్ 03, ఖమ్మం:** స్వాతంత్ర్య దినోత్సవమైన పంద్రాగస్టు నాటికి రాష్ట్రంలోని రైతులకు ధరణి పోర్టల్ నుంచి విముక్తి కల్పిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ తేదీ నాటికి

**తరువాయి 2లో**

## మానసిక రోగులకు
# కలుషితాహారం కాటు!



- ఎర్రగడ్డ ఆసుపత్రిలో ఒకరి మృతి.. మరో 70 మందికి అస్వస్థత
- నమూనాలను పరీక్షలకు పంపిన అధికారులు

**జూన్ 03, హైదరాబాద్:** హైదరాబాద్ ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో ఒక రోగి మృతి చెందడంతోపాటు మరో 70 మంది అస్వస్థతకు గురి కావడం మంగళవారం కలకలం రేపింది. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న 71 మంది మానసిక రోగులు సోమవారం మధ్యాహ్నం భోజనం అనంతరం అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా మారడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. డిశ్చార్జి కమిటీ (డీసీ) వార్డులో ఉంటున్న భూపాలపల్లికి చెందిన కరణ్ (30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతతో మంగళవారం ఉదయం చనిపోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉస్మానియా నుంచి

**తరువాయి 2లో**

## వానలపై అప్రమత్తంగా ఉండాలి

- సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

**జూన్ 03, హైదరాబాద్:** ఈసారి వర్షాలు సాధారణం కంటే ఎక్కువగా కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్న నేపథ్యంలో.. అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ''మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు

**తరువాయి 2లో**





# కనుల ముందు కలల కప్పు

- ఎట్టకేలకు ఆర్సీబీకి ఐపీఎల్ టైటిల్
- ఫైనల్లో పంజాబ్‌పై విజయం

**జూన్ 03 :** విరాట్ కోహ్లి కప్పు కల నెరవేరింది. బెంగళూరుదే ఐపీఎల్ 18 టైటిల్. మంగళవారం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో ఆర్సీబీ 6 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. మొదట బెంగళూరు 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. కోహ్లి (43; 35 బంతుల్లో 3×4) టాప్ స్కోరర్. మిగతా బ్యాటర్లు తలా కొన్ని పరుగులు చేశారు. అర్ష్‌దీప్, జేమీసన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. వైశాఖ్ (1/30) పొదుపుగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో పంజాబ్ 7 వికెట్లకు 184 పరుగులే చేయగలిగింది. కృనాల్ పాండ్య (2/17) అద్భుత బౌలింగ్‌లో ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. భువనేశ్వర్ (2/38) కూడా రాణించాడు. శశాంక్ సింగ్ (61 నాటౌట్; 30 బంతుల్లో 3×4, 6×6) టాప్ స్కోరర్.

తడబడిన పంజాబ్: 8.2 ఓవర్లలో 72/1తో మంచి పునాదే వేసుకుంది పంజాబ్. ప్రియాంశ్ (24) ఔట్ కాగా.. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (26)కు తోడైన ఇంగ్లిస్ (39; 23 బంతుల్లో 1×4, 4×6) దంచడం మొదలు పెట్టాడు. బ్యాటర్లు మరీ చెలరేగకపోయినా.. పంజాబ్ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న దశ అది. కానీ ఆ జట్టు ఇన్నింగ్స్ అనూహ్యంగా కుదుపునకు లోనైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయస్, ఇంగ్లిస్ వికెట్లు

**తరువాయి 2లో**

## 7న రాష్ట్రవ్యాప్తంగా
# 'యోగా డే' అవగాహన ర్యాలీలు



- 14న లక్ష ప్రాంతాల్లో యోగా సాధన
- ట్రాఫిక్ సహా ఏ ఇబ్బందీ ఉండకూడదు: సీఎం

**జూన్ 03, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7న 'యోగా డే' అవగాహన ర్యాలీలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 14న రాష్ట్రంలో లక్ష ప్రాంతాల్లో యోగా సాధన చేయాలని సూచించారు. 21న విశాఖలో 5 లక్షల మంది పాల్గొనేందుకు ఏర్పాట్లు పక్కగా జరగాలని ఆదేశించారు. ప్రధాని నరేంద్రమోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ పరంగా ఆంక్షలు ఉంటాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మంగళవారం యోగా డే పై సమీక్షించారు. '21న రాష్ట్రంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా డే కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా

**తరువాయి 2లో**

## పోలవరం.. డబుల్ ఇంజిన్ వేగం!

- మారిన ముఖచిత్రం.. 2027 చివరకు పూర్తయ్యే దిశలో..
- ఏడాదిలో సాంకేతిక సమస్యలన్నీ కొలిక్కి
- డయాఫ్రం వాల్ పనులు, బట్రస్ డ్యాం పనులు ముందుకు

**2లో**



# హెచ్‌టీ కనెక్షన్లపై కరెంటు బిల్లుల మోత!

**'పవర్ ఫ్యాక్టర్' సాకుతో ఆర్థికభారం**

- ఇక కొత్త విధానంలో యూనిట్ల లెక్కింపు
- కెపాసిటర్లు అమర్చుకోవాలంటూ వినియోగదారులకు డిస్కంల నోటీసులు
- పరిశ్రమల యాజమాన్యాల ఆందోళన

**జూన్ 03, హైదరాబాద్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(202526)లో కరెంటుఛార్జీలు పెంచలేదని చెబుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు పరోక్షంగా బిల్లుల భారం మోపుతున్నాయి. ప్రధానంగా హైటెన్షన్(హెచ్‌టీ) కరెంటు కనెక్షన్లున్న పరిశ్రమలు, వాణిజ్యసంస్థలపై అధిక ఆర్థికభారం పడేలా చర్యలు చేపడుతున్నాయి. కనెక్షన్ తీసుకున్న సమయంలో వినియోగదారులు అడిగిన వాస్తవలోడు కన్నా ఎక్కువ కరెంటును వినియోగిస్తున్నారని.. దీనిని నియంత్రించేందుకు 3 నెలల్లోగా కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు ఇస్తున్నాయి.

**కేవీఏఆర్‌హెచ్ విధానంతో..!**

హెచ్‌టీ కనెక్షన్లకు వినియోగిస్తున్న కరెంటును 'కిలోవాట్‌అవర్ (కేడబ్ల్యూహెచ్)' విధానంలో ఇంతకాలం లెక్కించగా ప్రస్తుతం 'కిలోఓల్ట్ యాంపియర్ రియాక్టివ్ అవర్ (కేవీఏఆర్‌హెచ్)' విధానంలో లెక్కిస్తున్నట్లు డిస్కంలు చెబుతున్నాయి.



# 7న రాష్ట్రవ్యాప్తంగా 'యోగా డే' అవగాహన ర్యాలీలు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, జిల్లాల్లో జరుగుతున్న యోగా సాధన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం సంతృప్తికరంగా ఉంది. పూర్తిస్థాయి సన్నద్ధతతో అత్యధిక మందితో యోగా నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాలనే లక్ష్యాన్ని పూర్తిచేయాలి' అని ఆదేశించారు.

**వర్షం కురిసినా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు**

21న విశాఖలో వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా జర్మన్ హ్యాంగర్లతో మరో వేదికను సిద్ధం చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి గ్రామం నుంచి యోగాలో పాల్గొనేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు తెలిపారు. 'యోగా కార్యక్రమంలో మూడు రోజుల పాటు పాల్గొనేవారికి ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నాం. యాప్ ద్వారా కూడా ప్రజలు వీటిని పొందొచ్చు. విద్యార్థులు, మహిళలు, డ్వాక్రా సంఘాల సభ్యులు, సామాన్య ప్రజలు... ఇలా అన్ని వర్గాలు విశాఖలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 2 కోట్ల మంది యోగా కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా. ఇప్పటివరకు 1.77 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు' అని ముఖ్యమంత్రికి వివరించారు.

# వానలపై అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలి. నీరు నిలిచిపోయే అవకాశమున్న 141 ప్రదేశాల్లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనులను వేగవంతం చేయాలి. వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలి. వర్షాలు, వరదల పర్యవసానాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలి. నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు నాటికి అన్ని భూసమస్యల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

భూభారతి చట్టం ద్వారా అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి హాజరయ్యారు. ములుగుమాడులో భూముల రీసర్వే ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 413 గ్రామాలకు నక్షా కూడా లేదన్నారు. ములుగుమాడు తరహాలోనే నక్షాలు లేని ఐదు గ్రామాలను ఎంపిక చేసి భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. దేశంలోని ఐదు ప్రముఖ సంస్థలకు ఈ బాధ్యతలు అప్పగించామని వెల్లడించారు. రెండు విధానాల (డ్రోన్లు, క్షేత్రస్థాయి సర్వే) ద్వారా రీసర్వే పూర్తిచేసి ప్రతి గ్రామానికి నక్షాను రూపొందిస్తామని వివరించారు. ప్రతి రైతు భూమికి కొలతలు వేసి, హద్దులు నిర్ణయిస్తామన్నారు. రాబోయే 35 రోజుల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆయా గ్రామాల్లో సర్వే చేస్తారని తెలిపారు. 3, 4 రోజుల్లోనే రాష్ట్రంలో 3,556 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తామని చెప్పారు.

# ఐరాస సర్వప్రతినిధి సభ కొత్త అధ్యక్షురాలిగా అనలీనా



ఐరాస: ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభకు కొత్త అధ్యక్షురాలిగా జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేబాక్ అత్యధిక మెజార్టీతో ఎన్నికయ్యారు. రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగు జరగాలన్న రష్యా డిమాండుకు అనుగుణంగా సభ్య దేశాలు ఆమెను ఎన్నుకున్నాయి. ఈ ఎన్నికకు మెజారిటీ మార్కు 88 ఓట్లు కాగా.. అనలీనా దాదాపు రెట్టింపు స్థాయిలో 167 ఓట్లు సాధించారు. మరో అభ్యర్థి అయిన జర్మన్ దౌత్యవేత్త హెల్గా ష్మిడ్‌కు 7 ఓట్లే పోలయ్యాయి. 14 దేశాలు ఓటింగుకు గైర్హాజరయ్యాయి. సెప్టెంబరులో జరిగే ఐరాస సర్వప్రతినిధి సభ 80వ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు ఫిలెమాన్ యాంగ్ నుంచి అనలీనా ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. 193 దేశాల సభ్యత్వం కలిగిన ఐరాస సర్వప్రతినిధి సభకు అధ్యక్షులుగా ఏడాదికి ఒకరిని ప్రాంతాల వారీగా ఎన్నుకుంటారు.

# ఈశాన్యాన్ని ఆదుకుంటాం: మోదీ

దిల్లీ: భారీ వర్షాలకు అతలాకుతలమైన ఈశాన్య రాష్ట్రాలను అన్నివిధాలా ఆదుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. గత కొద్దిరోజులుగా ఎడతెరిపిలేని వానలతో జనజీవనం అస్తవ్యస్తమైన నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, సిక్కిం సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్, మణిపుర్ గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాలతో మంగళవారం ఆయన ఫోన్లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ఇప్పటివరకు 40 మంది చనిపోగా, దాదాపు 6 లక్షల మందికిపైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిక్కింలో వేర్వేరు ప్రాంతాల్లో చిక్కుకుపోయినవారిని రక్షించేందుకు వాయుసేన రంగంలోకి దిగింది. రెండు ఎంఐ17 హెలికాప్టర్ల ద్వారా 34 మందిని కాపాడింది. 23 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సిక్కింకు చేరుకుంది. కొండచరియలు విరిగిపడటం వల్ల గల్లంతైన ఆరుగురు సైనికుల ఆచూకీని తెలుసుకోవడం, తాత్కాలిక సమాచార వ్యవస్థ ఏర్పాటుసహా వివిధ రూపాల్లో ఈ దళం చేయూత అందిస్తోంది.

# హెచ్‌టీ కనెక్షన్లపై కరెంటు బిల్లుల మోత!

(మొదటిపేజీ తరువాయి)

కేవీఏఆర్‌హెచ్ విధానంలో.. ఒక హెచ్‌టీ కనెక్షన్‌కు రోజూ వినియోగించే కరెంటు వాస్తవలోడు ఎంతనేది పరిశీలించి ఆ ఓల్టేజి ప్రకారం యూనిట్లను లెక్కిస్తున్నారు. దీంతో నెలవారీ బిల్లులు భారీగా పెరిగిపోతున్నాయి. పరిశ్రమలు, వాణిజ్యసంస్థలు చెల్లించే బిల్లులు సాధారణంగా రూ.లక్షల నుంచి రూ.కోట్లలో ఉంటాయి. వీటిపై 10శాతం పెరిగినా భారీగా ఆర్థికభారం పడుతోందని ఆయా యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. కరెంటు పంపిణీ, సరఫరా, వాణిజ్య (టీడీసీ) నష్టాలను తగ్గించుకునేందుకే ఈ విధానంలో కరెంటు వినియోగాన్ని లెక్కించి బిల్లులు జారీచేస్తున్నట్లు డిస్కంలు చెబుతున్నాయి. అదే 'కేడబ్ల్యూహెచ్'లో లెక్కిస్తే ఒక పరిశ్రమ వాస్తవంగా వినియోగించిన కరెంటు యూనిట్లకంటే తక్కువ యూనిట్లకు బిల్లులు జారీఅవుతున్నట్లు పేర్కొంటున్నాయి.

**'ల్యాగ్', 'లీడ్' కలిపి..**

అన్నివర్గాల కనెక్షన్లకు వాడుతున్న కరెంటును గ్రిడ్ నుంచి తీసుకుంటారు. ఇందులో 2 రకాలుంటాయి. కేవీఏఆర్‌హెచ్ విధానానికి సంబంధించి.. వీటిలో ఒకటి 'ఇండక్టివ్ రియాక్టివ్ ఎనర్జీ ల్యాగ్'.. మరొకటి 'కెపాసిటివ్ రియాక్టివ్ ఎనర్జీ లీడ్'. వేర్వేరు సమయాల్లో ఆయా కనెక్షన్లపై పడుతున్న కరెంటులోడు ప్రకారం ఇలా 'ల్యాగ్', 'లీడ్' అని వ్యవహరిస్తుంటారు. ఈ రెండింటినీ కలిపి మీటర్లలో పరిశీలించి ఆ కనెక్షన్‌పై వాడిన కరెంటు ఎన్ని యూనిట్లనేది లెక్కించి నెలవారీ బిల్లులు జారీచేయాలి. అయితే ఇంతకాలం మీటర్లలో 'లీడ్'ను లెక్కించకుండా బ్లాక్‌చేసి.. 'ల్యాగ్'ను మాత్రమే లెక్కించి బిల్లులు జారీచేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి డిస్కంలు ఇచ్చిన నివేదికలో తెలిపాయి. దీనివల్ల టీడీసీ నష్టాలు అధికంగా వస్తున్నాయని, వాస్తవ ఓల్టేజి తేలక తరచూ కరెంటుసరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నట్లు పేర్కొన్నాయి. నష్టాలు తగ్గించాలంటే 'ల్యాగ్', 'లీడ్' కలిపి లెక్కిస్తేనే వాస్తవంగా ఎంత కరెంటు వాడుకున్నారనేది తేలుతుందని వివరించగా ఈఆర్‌సీ అనుమతించింది. ఈ మేరకు ఎత్తిపోతల పథకాలు మినహాయించి మిగిలిన ప్రతి హెచ్‌టీ కనెక్షన్ మీటర్‌లో 'లీడ్'ను కూడా లెక్కించాలని డిస్కంలు నిర్ణయించాయి.

**పవర్ ఫ్యాక్టర్..!**

హెచ్‌టీ కనెక్షన్లపై వాడుతున్న కరెంటు ఓల్టేజీని తెలిపే 'పవర్ ఫ్యాక్టర్ (పీఎఫ్)' ఎప్పుడూ 0.95 ఉండేలా కెపాసిటర్లను ఏర్పాటుచేసుకోవాలి. పలు హెచ్‌టీ కనెక్షన్లను తనిఖీ చేసినప్పుడు ఇంతకన్నా చాలాతక్కువగా పీఎఫ్ నమోదవుతున్నట్లు డిస్కంలు గుర్తించాయి. ప్రభుత్వరంగానికి చెందిన రైల్వే పీఎఫ్ కూడా 0.95 కన్నా తక్కువగా ఉందని డిస్కంలు ఈఆర్‌సీకిచ్చిన తనిఖీల నివేదికలో పేర్కొన్నాయి. తనిఖీల్లో నగరంలోని ఒక ప్రైవేటు పరిశ్రమకు సగటు పీఎఫ్ లోడు 0.06 మాత్రమే ఉన్నట్లు గుర్తించాయి. అంటే ఆ పరిశ్రమకు వాడుతున్న కరెంటు కన్నా 92.14 శాతం అదనంగా లోడు పడుతున్నట్లు డిస్కం నిర్ధరించింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల 190 హెచ్‌టీ కనెక్షన్లను నమూనాగా తనిఖీచేస్తే 160కిపైగా కనెక్షన్లకు సంబంధించి అదనపు కరెంటు వినియోగమవుతున్నట్లు తేలిందని, ఇలాంటివాటిని నియంత్రించకపోతే టీడీసీ నష్టాలు అధికంగా వస్తాయని డిస్కంలు ఈఆర్‌సీకి తెలిపాయి. ఏ హెచ్‌టీ కనెక్షన్‌కు అయినాసరే వరుసగా 2నెలల పాటు పీఎఫ్ 0.95 కన్నా తక్కువలోడుతో వినియోగిస్తే.. వెంటనే మరుసటి 3 నెలల్లోగా దానిని 0.95 స్థాయికి తెచ్చేలా వినియోగం ఉండాలి. ఇందుకుగాను కెపాసిటర్లను అమర్చుకోవాలని డిస్కంలు చెబుతున్నాయి. లేకపోతే 3 నెలల్లోగా మీటర్‌లో 'లీడ్'ను అన్‌బ్లాక్ చేసి వాస్తవ కరెంటు వినియోగాన్ని గుర్తించి బిల్లులు జారీచేస్తామని డిస్కంలు వినియోగదారులకు ఇస్తున్న నోటీసుల్లో తెలిపాయి. అయితే 'ఇంతకాలం ల్యాగ్, లీడ్ కలిపి లెక్కించకుండా డిస్కంలు ఎందుకు వదిలేశాయి? ఇప్పుడు ఆ సాంకేతిక కారణాలు చూపిస్తూ బిల్లుల భారం మోపడం ఎంతవరకు సమంజసం' అని పరిశ్రమల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. ఉన్నపళంగా ఆర్థికభారం మోపడం సమంజసం కాదని, బిల్లులు పెంచవద్దని డిస్కంలను కోరుతున్నాయి.

**కెపాసిటర్లు తప్పనిసరి: డిస్కంలు**

"కేవీఏఆర్‌హెచ్ విధానంలో బిల్లుల జారీకి 202425లోనే ఈఆర్‌సీ అనుమతించింది. ఇప్పటికిప్పుడు హెచ్‌టీ కనెక్షన్లకు కరెంటు సరఫరా నిలిపివేయడం లేదు. వాటికిఉన్న మీటర్లలో పవర్ ఫ్యాక్టర్ 0.95 కన్నా తగ్గితే రాబోయే 3 నెలల్లోగా సరిచేసుకోమని మాత్రమే నోటీసులు ఇస్తున్నాం. ఈమేరకు కెపాసిటర్లను అమర్చుకోవాలి'' అని దక్షిణ ఉత్తర డిస్కంల సీఎండీలు ముషారఫ్, వరుణ్‌రెడ్డి తెలిపారు.

# మానసిక రోగులకు కలుషితాహారం కాటు!

(మొదటిపేజీ తరువాయి)



ప్రత్యేక బృందాన్ని రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేకంగా చక్కెర పరమాన్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను రోగులకు వడ్డించారు. సాయంత్రం డీసీ వార్డు, కోర్టు వార్డుల్లో మొత్తం 71 మంది రోగులకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యాధికారులు వారికి చికిత్స అందించారు. డీసీ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. బాధితుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి.. వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారని అధికారులు తెలిపారు. ఇలా తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత చెప్పారు. నా అనేవారు లేక.. పుట్టుకతోనే బుద్ధిమాంద్యం ఉన్న కరణ్.. మానసిక సమస్యలతో బాధపడుతుండడంతో 2023 ఆగస్టులో పోలీసులు అతడిని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స తర్వాత కోలుకోవడంతో అదే ఏడాది నవంబరులో వైద్యులు డిశ్చార్జి చేశారు. కానీ అతడికి నా అనేవారు లేకపోవడంతో డిశ్చార్జి కమిటీ వార్డులోనే ఉంటూ సోమవారం నాటి ఘటనలో మృతి చెందాడు.

**నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు**

వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి ఆసుపత్రికి వచ్చి.. క్లోజ్డ్ వార్డును, వంట గదిని పరిశీలించారు. ఆహారం కలుషితమైందా అనే కోణంలో ఆరా తీశారు. సంఘటనపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎంఈ తెలిపారు. రోగుల కోసం ప్రత్యేకించి ట్యాంకర్లలో తాగునీటిని తెప్పించి అందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

# కనుల ముందు కలల కప్పు




కృనాల్

(మొదటిపేజీ తరువాయి)

సహా మూడు వికెట్లు 26 పరుగుల వ్యవధిలో కోల్పోయి పంజాబ్ ఓటమి దిశగా సాగింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన కృనాల్ రెండు కీలక వికెట్లు పడగొట్టడమే కాకుండా, పరుగుల ప్రవాహాన్ని అడ్డుకుని పంజాబ్‌ను దెబ్బతీశాడు. కృనాల్ బౌలింగ్‌లో ప్రభ్‌సిమ్రన్ ఔట్ కాగా.. షెఫర్డ్ బౌలింగ్‌లో ఓ పేలవ షాట్‌తో శ్రేయస్ (1) నిష్క్రమించాడు. జోరుగా సాగుతున్న ఇంగ్లిస్.. కృనాల్ బౌలింగ్‌లో బౌండరీ వద్ద లివింగ్‌స్టన్ అందుకున్న ఓ చక్కని క్యాచ్‌కు వెనుదిరిగాడు. 14 ఓవర్లలో పంజాబ్ 106/4తో నిలవగా.. ఆర్సీబీ పట్టుబిగించింది. పంజాబ్ సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయింది. ఆఖరి ఆరు ఓవర్లలో 85 పరుగులు చేయాల్సిన పరిస్థితి. శశాంక్ రెండు సిక్స్‌లు, వధేరా ఓ సిక్స్ బాదడంతో పంజాబ్ మళ్లీ పోటీలోకి వచ్చింది. నాలుగు ఓవర్లలో 55 పరుగులు అవసరమయ్యాయి. కానీ భువనేశ్వర్ ఒకే ఓవర్లో (17వ) వధేరా (15), స్టాయినిస్ (6)లను ఇద్దరినీ ఔట్ చేసి పంజాబ్‌ను దెబ్బతీసి, ఆర్సీబీని సంబరాల్లో ముంచెత్తాడు. తర్వాతి ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసిన యశ్ దయాళ్ కేవలం 5 పరుగులే ఇచ్చి అజ్మతుల్లాను ఔట్ చేశాడు. ఆఖరి రెండు ఓవర్లలో పంజాబ్ 42 పరుగులు చేయాల్సిన స్థితిలో బెంగళూరు విజయం ఖాయమైపోయింది. కాకపోతే శశాంక్ దూకుడు ఆర్సీబీ ఓటమి అంతరాన్ని తగ్గించింది. ఆఖరి ఓవర్లో హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అతడు వరుసగా 6, 4, 6, 6 బాదేశాడు. కానీ సంబరాలు బెంగళూరివే.

రాణించిన ఆర్సీబీ బ్యాటర్లు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు ఆరంభంలో షాక్ తగిలింది. టోర్నీలో చక్కని ఆరంభాలనిచ్చిన ధనాధన్ బ్యాటర్ సాల్ట్ (16; 9 బంతుల్లో 2×4, 1×6).. ఈసారి త్వరగానే నిష్క్రమించాడు. టోర్నీలో ఆర్సీబీ టాప్ స్కోరర్ కోహ్లి ఎప్పటిలాగే యాంకర్ పాత్రను పోషించాడు కానీ.. బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. మయాంక్ (24; 18 బంతుల్లో 2×4, 1×6)తో కలిసి అతడు జట్టుకు మెరుగైన ఆరంభం వచ్చేలా చూశాడు. అయితే కొన్ని చక్కని షాట్లు ఆడిన మయాంక్‌ను ఏడో ఓవర్లో చాహల్ వెనక్కి పంపాడు. అప్పటికి స్కోరు ఆర్సీబీ స్కోరు 56. మయాంక్ స్థానంలో వచ్చిన కెప్టెన్ పాటీదార్ (26; 16 బంతుల్లో 1×4, 2×6) కూడా ధాటిగా ఆడినా.. కోహ్లి మాత్రం జోరందుకోలేదు. సింగిల్స్‌నే కొనసాగిస్తూ అతడికి సహకరించాడు. కానీ ఇది కూడా చిన్న భాగస్వామ్యమే. 7 నుంచి 10 ఓవర్ల మధ్య 32 పరుగులే రాగా.. 11వ ఓవర్లో పాటీదార్‌ను జేమీసన్ ఔట్ చేశాడు. ఆర్సీబీ పరుగుల వేగం తగ్గగా.. కోహ్లి గేర్ మార్చకుండానే 15వ ఓవర్లో నిష్క్రమించాడు. అప్పటి వరకు ఇన్నింగ్స్ పంజాబ్ నియంత్రణలోనే సాగినట్లనిపించింది. కానీ జితేశ్ శర్మ రాకతో ఆట స్వరూపమే మారింది. గతి తప్పిన జేమీసన్ ఓవర్లో జితేశ్ రెండు సిక్స్‌లు, లివింగ్‌స్టన్ (25; 15 బంతుల్లో 2×6) ఓ సిక్స్ బాదేశాడు. లివింగ్‌స్టన్‌ను ఔట్ చేసినా.. ఆ ఓవర్లో జేమీసన్ 23 పరుగులు సమర్పించుకున్నాడు. విధ్వంసకంగా బ్యాటింగ్ చేస్తున్న జితేశ్ (24; 10 బంతుల్లో 2×4, 2×6) క్రీజులో ఉండగా.. 17 ఓవర్లలో 168/5తో ఆర్సీబీ పెద్ద స్కోరు చేసేలా కనిపించింది. కనీసం 200 దాటడం ఖాయమనిపించింది. కానీ వైశాఖ్, అర్ష్‌దీప్‌ల సూపర్ బౌలింగ్‌తో ఆర్సీబీని పంజాబ్ కట్టడి చేసింది.

# పోలవరం.. డబుల్ ఇంజిన్ వేగం!

జగన్ సర్కార్ విధ్వంస ఛాయల నుంచి పోలవరం ప్రాజెక్టు బయటపడింది. ఏడాది క్రితం కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ప్రాజెక్టు పనులను మళ్లీ గాడిన పెట్టారు. ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్‌కు పట్టం కట్టడంతో కేంద్ర ప్రభుత్వమూ చేయూత అందిస్తోంది. అవసరమైన నిధులూ ముందే ఇస్తోంది. 'అసలు ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో, ఎప్పుడు పూర్తి చేస్తామో తెలియదు, చెప్పలేం. ఈ ప్రాజెక్టులో అన్ని సమస్యలు ఉన్నాయి' అంటూ నాడు జగన్ సర్కార్‌లో జలవనరుల మంత్రి బహిరంగంగా ప్రకటించి చేతకానితనాన్ని చాటుకున్న స్థాయి నుంచి '2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. ఖరీఫ్ కాలానికి నీళ్లందిస్తాం' అని నమ్మకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించే స్థాయికి ఈ ప్రాజెక్టు చేరుకోవడం ప్రధానం. ఈ ఏడాది కాలంలో పోలవరం ముఖచిత్రం మారిపోయింది. ప్రధాన డ్యాం నిర్మాణంలోనే కాదు ఎడమ కాలువ పనులూ పరుగులు పెడుతున్నాయి. జగన్ సర్కార్‌లో ఈ కాలువ పనులు ఒక్క శాతం కూడా చేయలేదు. ఐదేళ్ల కాలాన్ని పూర్తిగా వృథా చేసింది. అలాంటిది ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జులై నాటికి అనకాపల్లి జిల్లా వరకు ఎడమ కాలువలో గోదావరి వరద జలాలు పారించేలా పనులు చేపట్టారు. టెండర్లు పిలిచారు. గుత్తేదారులకు అప్పజెప్పారు. అధికారులు దగ్గరుండి లక్ష్యం చేరుకునేందుకు చెమటోడుస్తున్నారు.

**నాడు అనిశ్చితి..**

జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాల పరిమితి పూర్తయ్యే నాటికి పోలవరం ఒక అనిశ్చితి. విధ్వంసానికి చిరునామా. ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లందించేందుకు పూర్తి అవకాశం ఉన్న స్థాయి నుంచి అనేక సమస్యలతో ఈ ప్రాజెక్టును విధ్వంసానికి సాక్ష్యంగా మార్చివేశారు. 2020 వరదల్లో డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. అసలు ఆ విషయాన్ని గుర్తించడానికే ఏడాది సమయం పట్టింది. కొత్తది నిర్మించాలా? పాత వాల్ ఎంత మేర దెబ్బతింది? మరమ్మతులు చేయాలా? అనే అంశాలు కూడా జగన్ పాలనలో తేలలేదు. 2020 భారీ వరదల్లో ప్రధాన డ్యాం నిర్మించాల్సిన ప్రాంతంలో పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. అక్కడి భూ భౌతిక పరిస్థితులు మారిపోయాయి. అక్కడ డ్యాం ఎలా నిర్మించాలో కూడా అర్థం కాని పరిస్థితులు. వైబ్రో కాంపాక్షన్ పనులు మొదలు పెట్టినా వాటి సమర్థత తేలలేదు. జగన్ హయాంలో నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. ప్రధాన డ్యాం 1లో చేపట్టిన పనుల నాణ్యతపైనా ప్రశ్నలు మిగిలాయి. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నుంచి సీపేజీ పెరిగిపోయింది. వరదల సమయంలో ప్రధాన డ్యాంకు వరద సమస్య లేకుండా నిర్మించుకునేందుకు వీలుగానే 2 కాఫర్ డ్యాంలు నిర్మించారు. ఆ సీపేజీ వల్ల ప్రధాన డ్యాం ప్రాంతం అంతా వరద కాలంలో నీటితో నిండిపోతోంది. దీంతో అసలు ప్రధాన డ్యాం నిర్మాణమే సవాల్‌గా మారింది. కేంద్రం నుంచి అవసరమైన నిధులు పూర్తి స్థాయిలో అందలేదు. 45.72 మీటర్ల స్థాయికి నీళ్లు నిలబెట్టేలా డీపీఆర్‌కు కేంద్రం ఆమోదించాల్సి ఉన్నా అది సాధించలేదు. దీంతో జగన్ సర్కార్ తొలిదశలో 41.15 మీటర్లకు నీళ్లు నిలబెట్టేందుకు అయ్యే ఖర్చు ఎంతో లెక్కించి అందుకు అనుమతించాలంటూ ప్రతిపాదనలు పంపింది.

# ఇందిరమ్మ ఇల్లు నిరుపేదలకు వారం

*** ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

*** మోడల్ హౌస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

జిన్నారం,ప్రజాస్ఫూర్తి 03: నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పటాన్ చేరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన మోడల్ హౌస్ ను మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు



చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొంతింటిని నిర్మించుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం అవుతుందని అన్నారు. పూర్తి పారదర్శకతతో రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 మంజూరు కావడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఇల్లు మంజూరు అవుతాయని తెలిపారు. నూతన టెక్నాలజీతో అత్యంత తక్కువ ఖర్చుతో.. అన్ని సదుపాయాలతో ఇంటిని నిర్మించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీడీవో అరుణ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



*** రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బీ. విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్ లో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమర పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు డివిజన్ పరిధిలోని అన్ని కాలనిలలో దాదాపుగా రోడ్లు వేయడం జరిగిందని, మిగిలిన రోడ్లను కూడా త్వరలోనే పూర్తి చేస్తానన్నారు. ఎక్కడా కూడా నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ సాగర్, ఏఈ స్వాతి, మున్సిపల్ సిబ్బంది , స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

## నాణ్యమైన విత్తనాలు వేయడం వల్ల అధిక పంట దిగుబడి

**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నాణ్యమైన విత్తనాలు వేయడం వల్ల పంట అధిక దిగుబడిని రాబట్టవచ్చని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి విత్తనపు వడ్లను మంగళవారం వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామానికి ముగ్గురు రైతుల చొప్పున ఈ కొత్త వేరియంట్ దొడ్డు వరి వంగడాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ తలారి రాణి, నర్సింలు, వెల్ముల రాంరెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

## అక్రమ నిర్మాణాలు జిహెచ్ఎంసి ఆదాయానికి గండి



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : శేరిలింగంపల్లి నియోజకవర్గం లో అక్రమ షెడ్ల నిర్మాణం యదేచ్ఛగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని మియాపూర్ డివిజన్ హెచ్ఎంటి రోడ్ లో కృష్ణ సాయి ఎంక్లేవ్ ఎదురుగా అక్రమ కమర్షియల్ సెట్టర్స్ వేశారు. వీటికి పర్మిషన్ తీసుకోవాలంటే లక్షల్లో ఖర్చు అవుతుంది. అయితే మీరు మాత్రం ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 7 సెట్టర్స్ అక్రమ గా నిర్మించారు. ఒక నిర్మాణం గృహ నిర్మాణం కమర్షియల్ నిర్మాణం లకు విడివిడిగా పర్మిషన్ రేట్లు ఉంటాయి. అయితే ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణం చేయడం వల్ల జిహెచ్ఎంసి కి నష్టం కలుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి వాటికి నిర్మాణ అనుమతులు ఇవ్వకూడదని స్థానికులు కోరుచున్నాము. జిహెచ్ఎంసికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. జిహెచ్ఎంసి అధికారులు వీటిపై దృష్టి పెట్టి అక్రమ నిర్మాణాలను అరికట్టాలని వారి విజ్ఞప్తి చేశారు.

## రైతులకు న్యాయం చేయండి

*** చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్ ని కోరిన గుమ్మడిదల రైతులు**

జిన్నారం(గుమ్మడిదల),ప్రజాస్ఫూర్తి 03: గుమ్మడిదల మండలానికి చెందిన రైతులు తమ భూముల విషయంలో న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిశారు.చట్టప్రకారం అందాల్సిన నష్టపరిహారాన్ని తక్షణమే ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109లో ఉన్న అసైన్ భూములను ప్రభుత్వం ఐటీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కేటాయించడంతో రైతులు తమ జీవనాధారం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గోవర్ధన్ రెడ్డి నేతృత్వంలో రైతుల బృందం కలెక్టర్‌ను ప్రత్యక్షంగా కలుసుకుని తమ బాధలు వివరించారు. చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, తమ భూములు జీవనాధారమని, ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించాలని కోరారు. రైతుల వినతులను తీసుకున్న గమనించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, వారి సమస్యను పరిశీలించి



తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధిత రైతులకు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంపై సానుకూలంగా స్పందించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి,సూర్యనారాయణ అంజనేయులు యాదవ్, చంద్రారెడ్డి, రైతులు నారాయణ యాదవ్,మోహన్, మల్లేష్, బీరప్ప, బాషయ్య,రవీందర్, యాదవ్ కిషన్, సత్యనారాయణ, పెంటయ్య, రైతులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం ఇచ్చిన జీవో 8ని సవరించాలి

ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అంగన్ వాడీ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పైన ఐసిడిఎస్ మంత్రి సీతక్కని ములుగు జిల్లా క్యాంప్ ఆఫీస్ లో కలిసి వినతిపత్రం అందజేశారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ ఈ మధ్య ప్రభుత్వం ఇచ్చిన జీవో 8ని సవరించాలని, మినీ టీచర్స్ పెండింగ్ వేతనాలు, 24రోజుల సమ్మెకాలం వేతనాలు, ఇతర హామీలపైన మంత్రి తో చర్చలు జరిగాయి. చర్చల అనంతరం మంత్రి సీతక్క స్పందిస్తూ జీవో 8ని వెంటనే సవరిస్తామని, 2024 జులై 1 నుండి రిటైర్మెంట్ అయిన అంగన్వాడి ఉద్యోగులందరికీ పెంచిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ వర్తించే విధంగా ప్రత్యేకంగా సర్కులర్ ఇవ్వాలని కోరగా అదేవిధంగా సర్కులర్ ఇచ్చే విధంగా చూస్తామని అన్నారు. మినీ టీచర్స్ 11 నెలల పెరిగిన వేతనాలు ఏరియర్స్ చెల్లించడం కోసం ప్రయత్నం జరుగుతుందని అన్నారు. కారుణ్య నియామకాలు కూడా ఇచ్చే విధంగా పరిశీలన చేస్తున్నామని అన్నారు. 24 రోజుల సమ్మె వేతనాలు తప్పకుండా చెల్లిస్తామని, కాకపోతే ఆర్థిక పరిస్థితి బాలేదు కాబట్టి కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది కొంత ఓపికతో ఉండాలని, దసరా సందర్భంగా రెండవ దఫాలో ఇందిరమ్మ ఇండ్లను కూడా అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చే విధంగా చూస్తామని అన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని కోరగా ఈ అంశాన్ని పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి రాష్ట్ర కోశాధికారి పి.మంగ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.సమ్మక్క రాష్ట్ర నాయకురాలు సిహెచ్. రమాకుమారి ములుగు జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలు సరోజన జిల్లా అంగన్వాడి నాయకులు భాగ్యమ్మ, ధనలక్ష్మి, రుక్మిణి సిఐటియు ములుగు జిల్లా కార్యదర్శి రత్నం. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




## దీర్ఘకాలిక వ్యాధులు, పొగాకు తీసుకునే వారు క్షయ వ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువ

**- బంధనకల్‌లో క్షయ వ్యాధిపై అవగాహన**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాలిక వ్యాధులు, పొగాకు తీసుకునే వారు క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని డాక్టర్ గీతాంజలి తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ పిహెచ్‌సి ఆధ్వర్యంలో బంధనకల్ గ్రామంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ లక్షణాలు రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం ఉన్న వారు తేమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో 85 మందికి పైగా టిబి స్క్రీనింగ్ చేశామని, 14 మంది అనుమానితుల నుండి తేమడ నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పంపించమన్నారు. 14 మంది సింటమేటిక్ వాళ్ళని ఎక్స్ రేకి సిరిసిల్ల మెడికల్ కాలేజ్ రేడియాలజీ ల్యాబ్‌కి రెఫర్ చేసామని, అందులో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నెలల పాటు పూర్తి ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామన్నారు. అలాగే నిక్ష్యయ్ పోషన్ ద్వారా వ్యాధిగ్రస్తులకు నెలకి 1000రూపాయలు పౌష్టికాహారం కోసం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ మహిపాల్, టిబి నోడల్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పి ఉదయ్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలున్నారు.

## 21వ తేదీలోపు మున్సిపాలిటీలో వార్డుల విభజన

*** బొల్లారం జీహెచ్ఎంసీలోకి**

*** జిన్నారం మండల గ్రామాలు పంచాయతీలే**




జిన్నారం(గుమ్మడిదల),ప్రజాస్ఫూర్తి 03: ఈ నెల 21వ తేదీలోపు గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలలో వార్డుల విభజన జరగనుంది.గుమ్మడిదల,గడ్డపోతారం నూతనంగా మున్సిపాలిటీలుగా ఏర్పడటం,ఆయా మున్సిపాలిటీలో పలు గ్రామాలు విలీనమా కావడం జరిగింది.దీనితో వార్డుల విభజన అనివార్యం కాగా రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ సైతం ఈ నెల 21వ తేదీలోపు వార్డుల విభజన చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 3వ తేదీ నుండి 19వ తేదీ వరకు వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేసి 21వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇక బొల్లారం జీహెచ్ఎంసి పరిధిలోకి వెళ్లనుంది. జిన్నారం సైతం నూతన మున్సిపాలిటీగా అవతరించనుందని ఊహాగానాలు వచ్చినా జిన్నారంతో పాటు మండల గ్రామాలు పంచాయతీగానే ఉండనున్నాయని తెలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నూతన మున్సిపాలిటీలలో ఇక వార్డుల విభజన జరిగితే ఇక మరో కొత్త మున్సిపాలిటీలు ఏర్పడవని అధికారులు అంటున్నారు. దీంతో జిన్నారం నూతన మున్సిపాలిటీగా ఏర్పడదని తెలుస్తుంది.

## సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ సి బ్లాక్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ అంజయ్య నగర్ సి బ్లాక్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో సంక్షేమ సంఘం సభ్యులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మధ్య వారధిగా ఉండాలన్నారు. మీరు గెలిపించిన మీ నాయకుడిగా కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె.బాబు, నాగరాజు, వెంకటయ్య, లాలయ్య, రాజ శేఖర్, రమేష్, సోమేష్, అంజయ్య నగర్ సీ బ్లాక్ నూతన అధ్యక్షులు ఏ.గురవయ్య, ఉపాధ్యక్షులు ఎం.పాండు, ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, కోశాధికారి అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ



ప్రజా స్పూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మంగళవారం నుంచి నిర్వహించబడుతున్న పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షా కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్కాడ్ అయినా కొత్తగూడం యంఇఓ డాక్టర్ ప్రభుదయాల్ తన బృందంతో మణుగూరు, భద్రాచలంలో గల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మణుగూరు కేంద్రంలో 61 మంది, భద్రాచలంలో 58 మంది విద్యార్థులు హాజరైనట్లు 14 మంది గైర్హాజరైనట్లు తెలిపారు, పరీక్షలు పద్ధతిగా నిర్వహించుచున్నట్లు పేర్కొన్నారు

# నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాల ద్వారా మాత్రమే సాధ్యం..

*** బడిబాట కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ పాఠశాలలలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలను పొందేలా బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐ.డి. ఓ.సి, కార్యాలయం లో లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులతో కూడిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6 వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య , ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి అందరికీ తెలియజేసి, వారందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 6 నుండి 14 సం. వయసు కలిగిన బడిఈడు పిల్లలందరిని గుర్తించి, సమీపంలోని బడికి వెళ్లేలాగా ప్రోత్సహించాలన్నారు. మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో, మహిళా సమాఖ్యల ద్వారా, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, అర్హత కలిగిన తరగతుల్లో తిరిగి చేర్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో లభించే నాణ్యమైన విద్య గురించి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. బడిబాట కార్యక్రమంలో అధికారులు ప్రభుత్వ పాఠశాలలకు ఎవరైతే పిల్లలను పంపించడానికి ఇష్టపడటం లేదో దానికి గల కారణాలను నమోదు చేయాలన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయులు గ్రామాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు అందించే నాణ్యమైన విద్య గురించి వారికి అవగాహన కల్పించి తల్లిదండ్రుల యొక్క డబ్బు వృధా కాకుండా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా రానున్న రెండు వారాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించి వాటికి తగిన మరమ్మతులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యే నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు మట్టి ఇటుకలతో ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో ఏకరూప దుస్తుల తయారీ పూర్తి చేసి అన్ని పాఠశాలలకు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సదుపాయాలు మరియు పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉల్లాసం యాప్ ద్వారా 15 సంవత్సరాల కంటే పైబడిన వయస్సు వారిలో నిరక్షరాశులను గుర్తించి వారికి అభ్యాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 100% అక్షరాస్యత సాధించే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అదేవిధంగా ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణ పై అవగాహనలో భాగంగా, పాఠశాలల్లోని ఎకో క్లబ్స్ ఆధ్వర్యంలో, సీడ్ బ్యాంకు ద్వారా విత్తనాలు ఎక్కువగా సేకరించిన పాఠశాలలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో 100% ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో తులసి,చింత, ఉసిరి, వెలగ, మునగ మరియు కరివేపాకు చెట్లు విస్తృతంగా నాటాలన్నారు. జిల్లావ్యాప్తంగా అజోల్ల, బయోచార్, కంపోస్ట్ ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల నిర్మాణం, ఫామ్ పౌండ్స్ నిర్మాణం వంటి అంశాలపై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమన్వయ సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పి. పి.టి లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, మెప్మా పీడీ రాజేష్,జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వర చారి, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఇందిర, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, ఏపీఎంలు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అవరోదించిన కార్తికేయ కు ఘన సన్మానం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడాకు చెందిన పడకంటి విశ్వనాథ్ కార్తికేయ అతి చిన్న వయసులో ఎత్తైన పర్వతం మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అవరోదించారు. ఈ సందర్భంగా వారి నివాసంలో బ్రాహ్మణ సంఘం నేత మాజీ కార్పొరేటర్ కాందూరి నరేందర్ ఆచార్య , గాయత్రీ సంఘం అధ్యక్షులు నందూరి మోహన కృష్ణమాచార్య,కార్యదర్శి సర్వేశ్వర శర్మ లు కలిసి ప్రపంచంలో రెండవ స్థానంలో నిలిచిన చిరంజీవి కార్తికేయ ను అభినందించారు. ఈ సందర్భంగా ఏడు ఖండాలలోని ఎత్తైన పర్వతాలను అవరోదించడం మన భారతదేశంలోనే అతి చిన్న వయసులోనే ఘనత సాధించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో మైనర్ బాలికపై అత్యాచారం..

**నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష**



హైదరాబాద్: సరూర్‌నగర్ పీఎస్‌లో నమోదైన మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రాపురానికి చెందిన దర్శనం నాగరాజు.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉంటూ తాపీమేస్త్రిగా పనిచేసేవాడు. సరూర్‌నగర్ పరిధిలో ఉండే మైనర్ బాలికను 2024లో పెళ్లి పేరుతో తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో యాక్ట్‌తో పాటు చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసిన సరూర్‌నగర్ పోలీసులు నాగరాజును అరెస్టు చేసి జైలుకు తరలించారు. దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేసిన విచారణాధికారి సైదిరెడ్డి... కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్రాక్ కోర్టు.. నాగరాజుకు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.6 లక్షల పరిహారం ప్రకటించింది. కేసు నమోదైన అనతి కాలంలోనే నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన విచారణాధికారి, న్యాయవాదులు, కోర్టుకు.. బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## 2 ఇంక్లైన్ పంచాయతీ ప్రజల దాహార్తి తీర్చిన ఎమ్మెల్యే కూనంనేని

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:2 ఇంక్లైన్ పంచాయతీ ప్రజలు తాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా విషయాన్ని స్థానికులు కూనంనేని సాంబశివ రావు దృష్టి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఎమ్మెల్యే నిధుల నుంచి తక్షణమే 70 లక్షల రూపాయలు మంజూరు చేసి వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు త్వరగా చేయాలని ఆదేశించారు. అందులో భాగంగా మంగళవారం ఆర్డబ్ల్యూఎస్ ఈఈ, డిఈ శివయ్య, ఏఈ లెనిన్ , మున్సిపల్ అధికారులు టూ ఇంక్లైన్ మాజీ సర్పంచ్ నాగేష్, మాజీ ఉప సర్పంచ్ సింగిరాల రమేష్, పంచాయతీ కార్యదర్శి నర్మదా అందరూ కలిసి వాటర్ ట్యాంక్ నిర్మాణం కొరకు స్థలం పరిశీలన చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో త్వరగా పనులు చేయాలని అధికారులు చెప్పారు. అదేవిధంగా 30 లక్షల రూపాయలతో పంచాయతీలో ఉన్న రోడ్లు , డ్రైన్లో కూడా నిధులు కేటాయించారు మన ఎంతగానో ఎదుర్కొంటున్న సమస్య స్మశాన వాటిక రోడ్డు కూడా ఎమ్మెల్యే మంజూరు చేశారు. ఎమ్మెల్యే గెలిచిన మొదటి సంవత్సర కాలంలో 2 ఇంక్లైన్ పంచాయతీకి ఏకకాలంలో కోటి 20 లక్షల నిధులు కేటాయించారు. అదేవిధంగా 2 ఇంక్లైన్ పంచాయతీకి ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత ఇచ్చి ప్రొసీడింగ్ లెటర్ కూడా ఇప్పించారు. రాజీవ్ వికాస్ లోన్ లో కూడా 2 ఇంక్లైన్ ప్రజలకు ప్రాధాన్యత కల్పిస్తానని అదేవిధంగా ఎమ్మెల్యే 2 ఇంక్లైన్ అంటే నాకు ఎంతో మమకారం అని చెప్పారు. 2 ఇంక్లైన్ సిపిఐ నాయకులు కలిసికట్టుగా పనులు చేసుకుంటారని వారికి అభినందలు చెప్పారు.2ఇంక్లైన్ పంచాయతీ ప్రజలు తరపున కొత్తగూడెం ఎమ్మెల్యే కునంనేని సాంబశివ రావు కి , సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా కి పంచాయతీ ప్రజలతోపాటు 2 ఇంక్లైన్ సిపిఐ పార్టీ నాయకులు 2ఇంక్లైన్ సిపిఐ పార్టీ శాఖ కార్యదర్శి అంకుష్, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు తుముల శ్రీనివాస్, గడ్డ మురళి, సింగిరాల శేఖర్, ఎల్లబోయిన రాములు, కొలిపాక రాజ్ కుమార్, సన్నీ, తుముల శివ, సామల విజయ్, అక్బర్, ఆదినారాయణ, అన్నం దాస్ అశోక్, గుంజపడుగు రవి, గుంజపడుగు రాజేష్. తదితరులు ధన్యవాదాలు తెలిపారు..

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

*** సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో పదిహేను లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. కాలనీ లో కొన్ని ఇండ్లు తక్కువ ఎత్తులో ఉండడంతో రోడ్డు నిర్మిస్తే హైట్ పెరిగి వర్షాకాలంలో ఇబ్బంది అవ్వుతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ వరద నీరు ఇండ్లలోకి చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకొని సీసీ రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మరేళ్ల శ్రీనివాస్, జి.రవి, పోశెట్టిగౌడ్, షౌకత్ అలీ మున్నా, ముజీబ్, సంగమేష్, అగ్రవాసు, మోజెస్, ఫారూఖ్, ఖలీమ్, రాజుగౌడ్, గౌస్, శ్రీను, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ లో ఇందిరమ్మ ఇళ్ల " పట్టాల పంపిణి



బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో "ఇందిరమ్మ ఇళ్ల " పట్టాల పంపిణి కార్యక్రమం లో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొని అర్హులైన దరఖాస్తుదారులకు ఇళ్ల పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ శైలజ, మాజీ కార్పొరేటర్లు , అధికారులు పాల్గొన్నారు.

## ధరణి నగర్ లో తొలిరోజు షూటింగ్ ప్రారంభం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్ లో గల కనకదుర్గమ్మ టెంపుల్ లో తొలిరోజు షూటింగ్ ప్రారంభించడం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్ లో గల కనకదుర్గమ్మ టెంపుల్ లో తొలిరోజు షూటింగ్ ను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని ముహూర్తం షాట్ కు కెమెరా స్విచ్ ఆన్ చేసి, వెబ్ సిరీస్ షూటింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెబ్ సిరీస్ ముహూర్తం షాట్ ను కెమెరా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. అనంతరం కృష్ణ ప్రసాద్ ప్రొడక్షన్ లో చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్న నూతన వెబ్ సిరీస్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్. సమ్మారెడ్డి. శివరాజ్ గౌడ్. మోజెస్, సత్యనారాయణ, ప్రసాద్, ఫారూఖ్, ఖలీమ్, రాజుగౌడ్, వెబ్ సిరీస్ యూనిట్ సభ్యులు హీరో పరమేష్. హీరోయిన్ వర్షిక. కో డైరెక్టర్ మురళీకృష్ణ దేవకి తదితరులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ పోటీల ఖర్చుపై హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు

**: మంత్రి జూపల్లి**

హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలకు చాలా దేశాలతో పోటీ పడి హైదరాబాద్ అవకాశం దక్కించుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీలతో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, హస్తకళల గొప్పతనం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జూపల్లి మాట్లాడారు. భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. ''భారాస చేసిన ప్రతి ఆరోపణపై బహిరంగ చర్చకు నేను సిద్ధం. మిస్ వరల్డ్ పోటీల ఖర్చుపై హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేశారు. రూ.31కోట్ల ఖర్చులో 21 కోట్లు స్పాన్సర్ల ద్వారానే వచ్చింది. మరో 12 కోట్ల ఆదాయంపై ఒప్పందాలు ఉన్నాయి. రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు హరీశ్‌రావు ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలను ఆయన నిరూపిస్తారా? అని సవాల్ విసురుతున్నా. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది అబద్ధం. 30 తులాలు కాదు.. 3 గ్రాములు కూడా ఇవ్వలేదు'' అని జూపల్లి అన్నారు.

## కేసీఆర్ అభిమానులకు MLC కవిత కీలక పిలుపు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు ఇందిరా పార్క్ దగ్గర మహాధర్నా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మహాధర్నా కొనసాగనుంది. గోదావరి నీళ్లను ఒడిసి పట్టి.. నెర్రెలు బారిన తెలంగాణ నేలను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులు ఇవ్వడంపై కవిత మహాధర్నాకు పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి తలపెట్టిన మహా ధర్నాకు రాష్ట్ర నలుమూలల నుంచి కేసీఆర్ అభిమానులు, జాగృతి శ్రేణులు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రాణహితచేవెళ్లను కాళేశ్వరం ప్రాజెక్టుగా ఎందుకు రీడిజైన్ చేయాల్సి వచ్చింది..? కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాలను ఆమె వివరించనున్నారు. అలాగే.. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పడావు పెట్టడంతో ఏటా యాసంగి సీజన్‌లో రైతాంగానికి జరుగుతున్న నష్టం.. కాళేశ్వరం కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయాలపై మాట్లాడనున్నారు.

# వచ్చే పార్లమెంటు సెషన్‌లో జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానం!

వచ్చే పార్లమెంటు సమావేశాల్లో జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు గాను అన్ని ప్రధాన రాజకీయ పక్షాల నేతలతో పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు సంప్రదింపులు జరిపే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జస్టిస్ వర్మ ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టులో పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటు చేసుకోగా.. ఈ ఘటనలో భారీ మొత్తంలో



కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి.. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఇది నిజమేనని ధ్రువీకరించిన త్రిసభ్య కమిటీ సంబంధిత నివేదికను సుప్రీంకోర్టుకు అందించింది. ఈ క్రమంలోనే చర్యలకు ఉపక్రమించిన కేంద్రం.. అభిశంసనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.



## లద్దాఖ్‌లో రిజర్వేషన్లు, స్థానికతపై కేంద్రం కీలక ప్రకటన

దిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో నివసిస్తున్న ప్రజల భాష, సంస్కృతి, రాజ్యాంగ పరిరక్షణ కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వారి స్థానికత, రిజర్వేషన్ల అంశంపై అధికారిక ప్రకటన చేసింది. 85శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని నిర్ణయించింది. 15 ఏళ్లకు మించి ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు, కనీసం 7 ఏళ్లపాటు అక్కడ చదువుకొని 10 లేదా 12వ తరగతి పరీక్షలకు హాజరైనవారిని స్థానికులుగా గుర్తించాలని నిర్ణయించింది. అంతేకాకుండా లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మూడులో ఒక వంతు సీట్లు మహిళలకే కేటాయించనున్నారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని 2019లో రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌ను రెండు భాగాలుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌లు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో తమ భాష, సంస్కృతి, హక్కుల పరిరక్షణ కోసం స్థానికంగా నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో స్థానికుల ప్రయోజనాల లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. లద్దాఖ్ ప్రజల స్థానికత నిర్ధరణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని జనవరి 2023లో ఏర్పాటైంది. వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఈ బృందం వారి సమస్యలను తెలుసుకొని ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేసింది. మరోవైపు ఇవే డిమాండ్లపై పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా అక్టోబర్ 2024లో దిల్లీలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.

## హైకోర్టును ఆశ్రయించిన రన్యారావు తల్లి..!

బెంగళూరు: బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావుకు స్పెషల్ న్యాయస్థానం ప్రత్యేక షరతులతో బెయిల్ మంజూరు చేసినా ఆమె ఇంకా జైల్లోనే ఉన్నారు. దీంతో నటి తల్లి కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. బంగారం స్మగ్లింగ్ కేసులో రన్యారావుపై పలు కేసులు నమోదయ్యాయి. అయితే.. ప్రత్యేక కోర్టు ఆమెకు బెయిల్ చేసినప్పటికీ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.



విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం (కాఫిఫోసా చట్టం) కింద నమోదైన కేసులో ఆమెకు ఊరట లభించకపోవడమే అందుకు కారణం. దీంతో నటి కారాగారంలోనే ఉన్నారు. ఈ క్రమంలోనే రన్యారావు తల్లి తన కుమార్తెను విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. బెయిల్ వచ్చినా జైల్లోనే ఉంచారని.. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమార్తెను న్యాయస్థానంలో హాజరుపరచాలని అభ్యర్థించారు.

## ట్రంప్ ఫోన్ కాల్‌తో కాల్పుల విరమణ: రాహుల్ తీవ్ర విమర్శలు

భోపాల్: పహల్గాం దాడి అనంతరం పాకిస్థాన్ ఉగ్రమూకల పీచమణిచేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన పార్టీ కన్వెన్షన్‌లో పాల్గొని రాహుల్ ప్రసంగించారు. ''ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కాగానే.. మోదీకి ట్రంప్ ఫోన్ చేశారు. మోదీజీ.. ఏం చేస్తున్నారని ఫోన్‌లో ట్రంప్ అడిగారు. నరేందర్ .. సరెండర్ అనగానే మోదీ కాల్పుల విరమణ ప్రకటించారు. ట్రంప్ ఆదేశాలను తూచా తప్పకుండా మోదీ పాటించారు '' అని విమర్శించారు. ''అమెరికా బెదిరింపులను సైతం లెక్క చేయకుండా ఇందిరా గాంధీ హయాములో 1971లో పాకిస్థాన్‌ను భారత్ విచ్ఛిన్నం చేసింది. అగ్రరాజ్యాలకు కాంగ్రెస్ వ్యతిరేకంగా పోరాడింది. ఎప్పటికీ తలవంచదు. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్.. వీరంతా అగ్రరాజ్యాలకు



వ్యతిరేకంగా పోరాడిన యోధులే''అని అన్నారు.

## జీ7 నుంచి భారత్‌కు రాని ఆహ్వానం.. ఆరేళ్లలో తొలిసారి!

కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్‌పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది. కెనడాలో జరగనున్న జీ7 సదస్సులో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, రష్యా ఉక్రెయిన్‌ల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీకి ఇంకా ఆహ్వానం పంపలేదని తెలిసింది. ఒకవేళ ఆహ్వానం వచ్చినా.. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడికి వెళ్లక



పోవచ్చనే వాదన ఉంది. దీంతో జీ7లో ప్రధాని మోదీ పాల్గొనకపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది. ఇదే అంశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, ఇటలీ, కెనడాతోపాటు జర్మనీ అధినేతలు జీ7 సదస్సులో పాల్గొననున్నారని, వీరితోపాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా దేశాధినేతలకు ఆహ్వానం అందిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ వెల్లడించారు. 2014కు ముందుకు జీ8గా ఉండేదని, నాటి ప్రధాని మన్మోహన్‌కు అప్పట్లో ఆహ్వానం వచ్చేదన్నారు. 2014 తర్వాత ఈ సంప్రదాయం కొనసాగినప్పటికీ.. ఆరేళ్లలో తొలిసారి మన ప్రధానికి ఆహ్వానం అందలేదన్నారు. ఎలా చూసినా.. దౌత్యపరంగా ఇదో భంగపాటేనన్నారు. ఇదిలాఉంటే, జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణఅమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు.



## స్వేచ్ఛగా మాట్లాడడం అంటే ఇదేనా..? : శర్మిష్ఠ బెయిల్ నిరాకరించిన హైకోర్టు

కోల్‌కతా: న్యాయ విద్యార్థి శర్మిష్ఠ పనోలీకు కోల్‌కతా హైకోర్టులో నిరాశే మిగిలింది. తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. ఆపరేషన్ సిందూర్‌పై సినీ ప్రముఖులు మౌనం వహించడంపై శర్మిష్ఠ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టింది. స్వేచ్ఛగా మాట్లాడడం అంటే ఇదేనా అని మండిపడింది. వాక్ స్వాతంత్ర్యం సంపూర్ణం కాదని.. మతపరమైన వ్యాఖ్యలతో ఎవరి మనోభావాలను దెబ్బతీసేందుకు ఈ హక్కు వీలు కల్పించలేదని గుర్తు ఉంచుకోవాలి అని హైకోర్టు హితవు పలికింది. ''ఆమెకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఒక వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించారు. వాక్ స్వాతంత్ర్యం ప్రతీ ఒక్కరికీ ఉంటుంది. కానీ, ఇతరులను బాధపెట్టేలా మాట్లాడమని దాని అర్థం కాదు. మన దేశం వైవిధ్యభరితమైనది. అనేక కులాల, మతాల ప్రజలు ఇక్కడ కలిసి జీవిస్తున్నారు. అలాంటప్పుడు మనం ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి'' అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. శర్మిష్ఠకు మధ్యంతర బెయిల్ మంజూరుకు నిరాకరించిన కోర్టు.. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా.. ఉగ్రవాదులు పహల్గాంలో పురుషులపై జరిపిన మారణహోమం తర్వాత భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై కొందరు బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ మే 14న శర్మిష్ఠ సోషల్ మీడియా వేదికగా చేసిన వీడియో పోస్ట్ వివాదాస్పదంగా మారింది. ఆమె పోస్టుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత తన పోస్టులు, రీల్స్ తొలగించిన ఆమె క్షమాపణలు కోరారు. అనంతరం శర్మిష్ఠను పోలీసులు అరెస్టు చేశారు. కోల్‌కతా పోలీసుల చర్య భారత్‌లోని వాక్‌స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉందని టీఎంసీ ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఆమెను వెంటనే విడుదల చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే శర్మిష్ఠ పనోలీ బెయిల్ అభ్యర్థనను నిరాకరించిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

## పాక్ ఆర్మీ చీఫ్ భారత్‌పై విషం చిమ్మారు – సీడీఎస్ అనిల్ చౌహాన్

పహల్గాం ఘటనకు ముందు భారత్, హిందువులపై పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిం మునీర్ విషం చిమ్మారని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని, ఇక్కడ రక్తపాతం సృష్టించడమే వారి విధానమని మండిపడ్డారు. 'భవిష్యత్తు యుద్ధాలు, యుద్ధక్షేత్రాలు'పై పుణెలోని సావిత్రిబాయి ఫులే యూనివర్సిటీలో ప్రసంగించిన సీడీఎస్ జనరల్ చౌహాన్.. అంతర్జాతీయంగా సంఘర్షణల స్వభావం, పెరుగుతున్న సాంకేతిక ముప్పు, భారత్ సుదీర్ఘ కాలంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ.. నష్టాలు ముఖ్యం కాదని, తుది ఫలితం ఏంటన్నదే ముఖ్యమన్నారు. ''ఇరు దేశాలు వివిధ రకాల సైనిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకున్నాయి. యుద్ధక్షేత్రంలో




మాత్రం వాటిని పరీక్షించలేదు. రిస్క్ తీసుకోకుంటే.. విజయం సాధించలేరు. మనవద్ద అత్యుత్తమమైన యాంటీ డ్రోన్‌సిస్టమ్ ఉందని మనకు తెలుసు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఓవైపు పోరాటం, మరోవైపు రాజకీయ పరిణామాలు ఒకేసారి చోటుచేసుకున్నాయి. ఇక నష్టాల గురించి నన్ను అడిగితే.. అవి ముఖ్యం కాదు. ఎలా స్పందించాం.. ఫలితం ఏంటన్నదే ముఖ్యం. నష్టాలు, ఎదురుదెబ్బలు అనేవి సైన్యంపై ప్రభావం చూపవు. యుద్ధంలో.. ఎదురుదెబ్బలు ఎదురైనా మనోబలం ఎంతో ముఖ్యం'' అని జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు.

**20వేల మందిని కోల్పోయాం..**

''పహల్గాం ఘటన అత్యంత క్రూరమైనది. కుటుంబీకుల కళ్ల ముందే అత్యంత దారుణానికి ఒడిగట్టారు. మతం పేరుతో చంపడం ఆధునిక ప్రపంచంలో ఆమోదయోగ్యం కాదు. ఈ ఘటన సమాజంలో ప్రకంపనలు సృష్టించింది. సుదీర్ఘకాలంగా భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రదాడులను ఈ ఘటన మళ్లీ గుర్తుచేసింది. పాశ్చాత్య దేశాలు ఒకటి, రెండు ఉగ్రదాడులు ఎదుర్కొంటే.. భారత్‌లో జరిగిన వందలాది ఉగ్రదాడుల్లో 20వేల మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారు'' అని సీడీఎస్ చౌహాన్ ఆవేదన వ్యక్తంచేశారు.

**జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే కుదుళ్లు దృఢంగా ఉండాలి. ఇందుకోసం పోషకాహారం తీసుకోవడం, సహజసిద్ధమైన హెయిర్ ప్యాక్స్ వేసుకోవడం మనకు అలవాటే! అయితే ఈ జాబితాలో మునగాకు పొడిని కూడా చేర్చుకోమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో దీన్ని కూరల్లో భాగం చేసుకోవడంతో పాటు.. ఈ పొడితో హెయిర్ ప్యాక్స్/మాస్కులు తయారుచేసుకొని ఉపయోగించడం వల్ల కుదుళ్లు/జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని చెబుతున్నారు.**



మునగాకు పొడిలో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ 'సి', విటమిన్ 'బి6', ఐరన్, జింక్, క్యాల్షియం.. వంటి పోషకాలుంటాయి. ఇవి కుదుళ్లలో ఉన్న సమస్యల్ని దూరం చేసి.. జుట్టు ఆరోగ్యంగా ఎదిగేలా చేస్తాయి. అందుకే వీటిని చర్మ, జుట్టు సౌందర్యోత్పత్తుల తయారీలో విరివిగా వాడుతుంటారు.



*** జిడ్డుదనం దూరం!**

కుదుళ్లు జిడ్డుగా మారడం వల్ల చుండ్రు, దురద.. వంటి సమస్యలొస్తాయి. ఇవి జుట్టు రాలడానికి కారణమవుతాయి. మునగాకు పొడి వీటికి విరుగుడుగా పనిచేస్తుంది. ఇందులో ఉండే జింక్.. కుదుళ్లలోని నూనె గ్రంథులు విడుదల చేసే సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది. తద్వారా కుదుళ్లు తేమగా ఉండి.. జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయి. ప్రకాశవంతంగానూ కనిపించేలా చేస్తాయి.

**దురద రాకుండా!**

కొంతమందికి కుదుళ్లలో దురద, పొక్కుల్లా ఏర్పడడం, ఎగ్జిమా, సొరియాసిస్.. వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటి వారు మునగాకు పొడితో తయారుచేసిన హెయిర్ మాస్కులు ఉపయోగించడం, ఈ పొడిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. మునగాకు పొడిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కుదుళ్లలోని ఆయా సమస్యల్ని దూరం చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఫలితంగా కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.. జుట్టూ ఆరోగ్యంగా పెరుగుతుంది.

*** జుట్టు నెరవకుండా!**

తెల్ల జుట్టు.. ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటోన్న సమస్య ఇది. ఇందుకు కారణం.. శరీరంలో ఉండే ఫ్రీరాడికల్సే! ఇవి చర్మ ఆరోగ్యంపైనే కాదు.. కుదుళ్లపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయి. అందుకే వీటితో పోరాడే గుణాలున్న మునగాకు పొడిని మనం తీసుకునే ఆహారం, పాటించే బ్యూటీ రొటీన్‌లో భాగం చేసుకోవాలంటున్నారు నిపుణులు. ఈ పొడిలో అత్యధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ 'సి' ఫ్రీరాడికల్స్‌తో పోరాడి ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫలితంగా తెల్ల జుట్టు రాకుండా జాగ్రత్తపడచ్చు.

*** పట్టుకుచ్చులా.. ప్రకాశవంతంగా!**

జుట్టు ఒత్తుగా పెరగడమే కాదు.. పట్టుకుచ్చులా మెత్తగా, ప్రకాశవంతంగా ఉన్నప్పుడే దాని అందం ఇనుమడిస్తుంది. మునగాకులోని బెహెనిక్ ఆమ్లం ఈ పనుల్ని సమర్థంగా నిర్వర్తిస్తుంది. ఎందుకంటే ఈ ఆమ్లం జుట్టుకు సహజసిద్ధమైన కండిషనర్‌లా పనిచేస్తుంది. తద్వారా ఆశించిన ఫలితాల్ని పొందచ్చు.

*** కుదుళ్లు దృఢంగా!**

కుదుళ్లు ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నప్పుడే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. మునగాకు పొడిలోని ఒలియిక్ ఆమ్లం, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఇందుకు దోహదం చేస్తాయి. కుదుళ్లలో వాపు, ఇతర సమస్యల్ని దూరం చేసి.. కుదుళ్ల ఆరోగ్యాన్ని ప్రేరేపిస్తాయి.





*** ఈ మాస్క్ ట్రై చేయండి!**

మునగాకు పొడితో కుదుళ్లు, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలంటే.. ఈ హెయిర్ మాస్క్ చక్కగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. టేబుల్ స్పూన్ చొప్పున మునగాకు పొడి, ఉసిరి పొడి ఒక బౌల్‌లోకి తీసుకొని కలుపుకోవాలి. దీనికి కొద్దికొద్దిగా పెరుగు జత చేస్తూ పేస్ట్‌లాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లు, జుట్టుకు పట్టించి అరగంట పాటు అలాగే ఉంచుకోవాలి. ఆపై శుభ్రం చేసుకుంటే.. ఆశించిన ఫలితాలు పొందచ్చు. ఈ మాస్క్ జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది.

*** కండిషనర్‌లా!**

మునగాకు పొడితో సహజసిద్ధమైన కండిషనర్‌ని కూడా తయారుచేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఇందుకోసం రెండు కప్పుల నీటిలో టేబుల్‌స్పూన్ మునగాకు పొడి వేసి మరిగించాలి. చల్లారాక ఈ నీటిని వడకట్టి.. తలస్నానం చేశాక కుదుళ్లు, జుట్టు మొత్తం తడిసేలా తలపై నుంచి పోసుకోవాలి. కాసేపయ్యాక గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది. ఈ చిట్కా జుట్టును ప్రకాశవంతంగా మారుస్తుంది. ఇక ఇదే మిశ్రమాన్ని హెయిర్ టోనర్‌గానూ వాడుకోవచ్చు.

## నిద్రలేని రాత్రులు గడుపుతున్నారా..?

### ఈ మొక్కను మీ బెడ్ రూమ్‌లో ఉంచుకుంటే చాలు !





* ఇటీవలి కాలంలో అనేక మందిని వేధిస్తున్న సమస్యల్లో నిద్రలేమి కూడా ఒకటి. ఒక విధంగా చెప్పాలంటే అన్ని అనారోగ్య సమస్యలకు ఇది మూలం అంటారు నిపుణులు. ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే నాణ్యమైన నిద్ర అవసరమని చెబుతుంటారు. అయినప్పటికీ జీవనశైలిలో మార్పులు, నైట్ షిఫ్టులు వంటి పలు ఇతర కారణాలవల్ల కొందరు నిద్రలేమిని ఎదుర్కొంటూ ఉంటారు. అలాంటి వారికి పాటించదగిన కొన్ని పరిష్కారాలు కూడా ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. అలాంటి వాటిలో లావెండర్ మొక్క కూడా ఒకటి. దీనిని బెడ్ రూములో పెట్టుకోవడంవల్ల నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టడంతో పాటు పలు బెనిఫిట్స్ ఉన్నాయి. అవేంటో చూద్దాం.

* లావెండర్ మొక్కలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. దాని సహజ నూనెలలో లినలూల్, లినలైల్ అసిటేట్ వంటి సమ్మేళనాలు కూడా ఉంటాయి. కాబట్టి దీనిని బెడ్ రూములో ఉంచడంవల్ల పలు రకాల కీటకాలు రాకుండా ఉంటాయి. అంతేకాకుండా నాడీ వ్యవస్థను శాంతిపరచడంలో, మెరుగైన నిద్రను ప్రేరేపించడంలో సహాయపడుతుంది. ఈగలు, దోమలను, పలు రకాల కీటకాలను దూరంగా ఉంచడంలో ఈ మొక్కలోని ఔషధ గుణాలు, వాసనలు సహజ నిరోధకాలుగా పనిచేస్తాయి.

* 2011 నాటి 'Journal of Medical Entomology'లో పబ్లిషైన అధ్యయనం ప్రకారం లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్ దోమలను నిరోధించడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. ముఖ్యంగా ఇందులోని సుగంధం విషపూరిత కీటకాలను గందరగోళ పరచడంవల్ల అవి మొక్క ఉన్న పరిసరాల్లోకి రాకుండా ఉంటాయి. లావెండర్ మొక్క గదిలోని తేమను గ్రహిస్తుంది. ఎయిర్ క్వాలిటీని పెంచుతుంది.

* లావెండర్ మొక్కలోని సుగంధం నాడీ వ్యవస్థను ఉత్తేజ పరచడం ద్వారా ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. 2005లో వెస్లియన్ యూనివర్సిటీ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం లావెండర్ సుగంధాన్ని పీల్చడం నిద్రవేళలో హృదయ స్పందన రేటును తగ్గిస్తుంది. డీపెస్ట్ అండ్ క్వాలిటీ స్లీప్‌ను ప్రోత్సహిస్తుంది. అయితే లావెండర్ మొక్కను బెడ్ రూములో ఉంచే విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు అవసరం అంటున్నారు నిపుణులు. బయటి వెలుతురు, ఎండ తగిలేలా కిటికీ దగ్గర పెట్టడం మంచిది.

## అందానికి సబ్జా సాయం!

**సబ్జా గింజలు.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ముఖ్యంగా, వేసవిలో వేధించే వేడిని తగ్గిస్తాయి. శరీరం నుంచి టాక్సిన్స్‌ను బయటికి పంపడంలోనూ సాయపడుతాయి. అయితే, అందాన్ని కాపాడటంలోనూ సబ్జా గింజలు ముందుంటాయి.**

* చర్మాన్ని లోలోపలి నుంచి శుభ్రం చేయడంలో సబ్జా గింజలు సమర్థంగా పనిచేస్తాయి. వీటిలో సహజంగా ఉండే డీటాక్స్ గుణాలు.. చర్మం లోపలి పొరల్లో చేరిన టాక్సిన్లను బయటికి పంపిస్తాయి. దాంతో చర్మం కాంతిమంతంగా మారుతుంది. మొటిమలూ తగ్గుముఖం పడతాయి.

* తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్‌తో నిండిన సబ్జా గింజలు.. ఆకలిని నియంత్రిస్తాయి. ఫలితంగా బరువు తగ్గడంలో సాయపడతాయి.

* సబ్జా గింజల్లో ఉండే యాంటి బయోటిక్, యాంటి ఫంగల్, యాంటి మైక్రోబియల్ లక్షణాలు.. చర్మ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఇందుకు కారణమయ్యే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి. సబ్జాలో ఉండే చర్మ స్థితిస్థాపక లక్షణాలు.. చర్మం త్వరగా కోలుకోవడానికి తోడ్పడతాయి.

* చర్మానికే కాదు.. జుట్టుకూ సబ్జా గింజలు మంచి పోషణ అందిస్తాయి. వీటిలో అధికంగా లభించే విటమిన్ కె, బీటా కెరోటిన్, ఇతర ప్రొటీన్లు.. జుట్టు, కుదుళ్లు దృఢంగా ఉండేలా చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది.



రెండోరోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!

# అమ్మకాల ఒత్తిడితో డౌన్..!



**ముంబై:** వారంలో రెండోరోజైన మంగళవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. గ్లోబల్ మార్కెట్‌లో సానుకూల ప్రవనాలతో మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. రియాల్టీ మినహా అన్నిరంగాల్లో అమ్మకాలు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,492.50 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే సూచీలు నష్టాల్లోకి జారుకుతున్నాయి. ఇంట్రాడేలో 81,774.23 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,575.09 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. చివరగా 636.24 పాయింట్లు పతనమై.. 80,737.51 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 174.10 పాయింట్ల నష్టంతో 24,542.50 పాయింట్ల వద్ద ముగిసింది. మార్కెట్‌లో దాదాపు 1,701 షేర్లు లాభపడగా.. 2,148 షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం తగ్గింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. రియాల్టీ ఇండెక్స్ ఒకశాతం పెరిగింది.

బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ప్రైవేట్ బ్యాంక్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.5-1 శాతం తగ్గాయి. నిఫ్టీలో అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, పవర్ గ్రిడ్ నష్టపోగా.. గ్రాసిమ్ ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎం అండ్ ఎం, బజాజ్ ఆటో, సిప్లా లాభపడ్డాయి. ఇదిలా ఉండగా.. నిఫ్టీ బ్యాంక్ ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి 56,161 పాయింట్లను తాకింది. మరో వైపు మంగళశారం ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. బీఎస్ఈలో 100కి పైగా స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో గార్డెన్ రీచ్, రాడికో ఖైతాన్, దీపక్ ఫెర్టిలర్స్, ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, సోలార్ ఇండస్ట్రీస్, భారతి హెక్సాకామ్, సిటీ యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, ఇంటెలెక్ట్ డిజైన్, ఇండియన్ బ్యాంక్ ఉన్నాయి. ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ షేర్లు ఐపీఓ ధర కంటే 19శాతం ప్రీమియంతో లిస్టింగ్ అయ్యాయి. బీఎస్ఈలో 20.05 శాతం పెరిగి రూ.126.05 వద్ద ముగిశాయి.

## మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్‌లు..

300 మంది తొలగింపు




**న్యూఢిల్లీ:** ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగులకు షాకిచ్చింది. దాదాపు 300 మందికిపైగా ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. తాజా తొలగింపులు వాషింగ్టన్ కార్యాలయం నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. తాజా కోతలు సంస్థలోని మొత్తం సిబ్బందిలో 1 శాతం కంటే తక్కువ అని ది సియాటిల్ టైమ్స్ నివేదిక తెలిపింది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నాం' అని మైక్రోసాఫ్ట్ తన అధికారిక ప్రకటనలో తెలిపింది. తాజా రౌండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రొడక్ట్ మేనేజర్లు ఎక్కువగా ఎఫెక్ట్ అయినట్లు సమాచారం.

కాగా, మైక్రోసాఫ్ట్ గత నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే.

## అరటితొక్క కారు అదుర్స్..

దీన్ని కూర్చుని కాదు పడుకుని నడపాలి..



**న్యూఢిల్లీ:** సాధారణంగా అరటి పండు తిన్న తర్వాత తొక్కను వదిలేస్తాం. దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని భావిస్తాం. ఆ తొక్క ఇంటి పరిసరాల్లో ఉంటే ఎవరైనా జారి పడతారనే భయంతో దూరంగా విసిరేస్తాం. అయితే అందరూ చిన్నరూపు చూసే అరటి తొక్క ఒక కారు తయారీకి ప్రేరణగా నిలిచిందంటే నమ్ముతారా. తైవాన్ చెందిన ఓ కంపెనీ అరటి తొక్క ప్రేరణతో హెూండా సివిక్ కారును మోడిఫికేషన్ చేసింది. బనానా పీల్ పేరుతో రూపొందించిన ఈ కారు ఎంతో ఆకట్టుకుంటోంది. సాధారణ కార్లకు భిన్నంగా తయారు చేసిన ఈ కారును చూస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. స్టాన్స్ గ్యారేజ్ తైవాన్ రూపొందించిన బనానా పీల్ కారు అతి తక్కువ ఎత్తులో ఉంటుంది. దీని చక్రాలు బయటకు కనిపించవు. సాధారణ కారును అడ్డంగా సగానికి కట్ చేస్తే, మిగిలే పైన భాగం మాదిరిగా కనిపిస్తుంది. ఈ మోడల్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అందరికీ ఆకర్షిస్తోంది. కార్ల అభిమానులకు కొత్తదనం అందిస్తోంది. ఈ కారును చూడగానే అందరికీ కలిగే ఒకే ఒక్క సందేహం. దీన్ని డ్రైవర్ ఎలా నడుపుతాడనే. నిజమే ఈ కారును డ్రైవర్ కూర్చుని కాకుండా పడుకుని నడపాలి. అరటి తొక్క కారును అనేక ప్రత్యేకతలతో రూపొందించారు. సస్పెన్షన్ వ్యవస్థను తక్కువ రైడ్ ఎత్తుకు అనుమతించే విధంగా మార్పు చేశారు. వేగంగా వెళ్లడానికి దోహదపడేలా రూపొందించారు. తగ్గించిన సస్పెన్షన్ కు అనుగుణంగా బాడీని మంచి లుక్ లోకి తీసుకువచ్చారు. ఈ కారులో సీట్లు లేకపోవడం మరో అద్భుతం. డ్రైవర్ పడుకుని కారును నడపాలి. విండ్ షీల్డ్ కు బదులుగా కెమెరాల వ్యవస్థను ఉపయోగించి నావిగేట్ చేయాలి. బనానా పీల్ కారుకు దానికి రంగు ఎంతో ప్రత్యేకతను తీసుకువచ్చింది. అరటి పండు తొక్క మాదిరిగా పసుపు రంగులో ఆకట్టుకుంటోంది. ఈ రంగును ఎంచుకోవడానికి పెద్ద చరిత్రే ఉంది. పసుపు రంగు ఏ వాతావరణంలోనైనా ప్రత్యేకంగా కనిపించడమే దీనికి ప్రధాన కారణం. ఇక ఈ కారు చక్రాలు బయటకు కనిపించవు. వరద నీటితో తేలుతున్న కారు మాదిరిగా ఉంటుంది.

### యాక్సిస్ బ్యాంకు ఏటీఎం ఛార్జీల మోత.. జూలై 1 నుంచి అమలు

అతి తక్కువ ఎత్తు ఉన్నప్పటికీ ఈ కారు పనితీరు బ్రహ్మాండంగా ఉంటుంది. భూమి నుంచి కొన్ని మిల్లీమీటర్ల ఎత్తులో ప్రయాణం చేస్తుంది. తక్కువ గ్రౌండ్ క్లియరెన్స్ ఉండడంతో చదునైన, అడ్డంకులు లేని నేలపైనే పరుగులు తీస్తుంది. అయితే సస్పెన్షన్, అలైన్ మెంట్ లో సర్దుబాటు చేయడం ద్వారా దీన్ని రోడ్డుపై ప్రయాణానికి అనువుగా మార్చుకోవచ్చు. ఈ కారును ఆటో ఎగ్జిబిషన్లలో ప్రదర్శించేందుకు తయారు చేశారు. సోషల్ మీడియాలో బనానా పీల్ కారు విపరీతంగా వైరల్ అయ్యింది. కొందరు ఈ ఆవిష్కరణను ప్రశంసించగా, మరికొందరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కారులో ఎలా కూర్చోవాలి, ఈ కారు కాంక్రీటులో పాతి పెట్టనట్టు ఉంది, కారు చక్రాలు ఎక్కడ అంటూ కామెంట్లు పెట్టారు. అయితే ఈ కారును రోడ్లపై ఎప్పుడు చూస్తామనే విషయంలో స్పష్టత లేదు.



# ఈ సాలా కప్ ఆర్సీబీదే

ఐపీఎల్-2025 ఛాంపియన్ ఆర్సీబీ

18 ఏళ్ల నిరీక్షణకు తెర..

ఆర్సీబీకి తొలి ఐపీఎల్ టైటిల్

ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌పై ఆర్సీబీ గెలుపు

విరాట్ కోహ్లీ చిరకాల స్వప్నం సాకారం

అహ్మదాబాద్‌లో బెంగళూరు అభిమానుల సంబరాలు

**అహ్మదాబాద్:** ఐపీఎల్‌లో ఛాంపియన్‌గా నిలవాలనుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. మూడుసార్లు ఆఖరి మెట్టుమీద తడబడిన ఆర్సీబీ ఎట్టేకేలకు ట్రోఫీని ముద్దాడింది. అహ్మదాబాద్‌లో ఉత్కంఠగా సాగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి విజేతగా అవతరించింది. విరాట్ కోహ్లీ(43), జితేశ్ శర్మ(24) మెరుపులతో 190 రన్స్ కొట్టిన బెంగళూరు.. కృనాల్ పాండ్యా(2-17) రాణించడంతో పంజాబ్‌ను కట్టడి చేసింది. శశాంక్ సింగ్(61 నాటౌట్) చివరిదాకా పోరాడినా ఓటమిని తప్పించలేకపోయాడు. చివరి ఓవర్లో శశాంక్ 22 సిక్సర్లతో చెలరేగినా.. బెంగళూరు విజయం ఖాయమైంది.

ఈ సాలా కప్ నమదే అంటూ ఐపీఎల్ బరిలో నిలిచే ఆర్సీబీ తమ కలను సాకారం చేసుకుంది. ఆరంభ సీజన్ నుంచి ట్రోఫీ కోసం చకోర పక్షిలా ఎదురుచూసిన ఆ జట్టు 18వ సీజన్‌లో ఛాంపియన్‌గా అవతరించింది. ఉత్కంఠ పోరులో పంజాబ్ కింగ్స్‌ను మట్టికరిపించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. దాంతో, రెండోసారి ఫైనల్ చేరిన పంజాబ్‌కు గుండెకోత తప్పలేదు.





### అయ్యర్ వికెట్‌తో మలుపు

బెంగళూరు నిర్దేశించిన భారీ ఛేదనలో పంజాబ్ ఓపెనర్లు దూకుడుగా ఆడారు. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న ప్రియాన్ష్ ఆర్య(24) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అయితే.. ప్రభ్‌సిమ్రన్(26) సింగ్‌కు 9 పరుగుల వద్ద లైఫ్ లభించింది. హేజిల్‌వుడ్ ఓవర్లో అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను షెపర్డ్ నేలపాలు చేశాడు. చేతుల్లో పడిన బంతిని ఒడిసి పట్టుకోలేకపోయాడు. ఆ తర్వాత హేజిల్‌వుడ్ ఓవర్లో వరుసగా 2 ఫోర్లు బాదిన ప్రియాన్ష్.. చివరకు అతడి ఓవర్లోనే వెనుదిరిగాడు. పవర్ ప్లేలో 52 రన్స్ చేసిన పంజాబ్ పటిష్ట స్థితిలో ఉంది. కానీ, కృనాల్ పాండ్యా ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ భువనేశ్వర్‌కు తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం వచ్చిన వచ్చిన శ్రేయాస్ అయ్యర్ (1) నిరాశపరిచాడు. క్వాలిఫయర్ 2లో అజేయ అర్థ శతకంతో జట్టును గెలిపించిన అతడు షెపర్డ్ బౌలింగ్‌లో బంతిని థర్డ్ మ్యాన్ దిశగా ఆడబోయి వికెట్ కీపర్ జితేశ్ చేతికి చిక్కాడు. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే ఇంగ్లిస్‌ను కృనాల్ ఔట్ చేయగా 94 వద్ద నాలుగో వికెట్ పడింది.

ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరగా ఒత్తిడిలో పడిన పంజాబ్‌ను గెలిపించే బాధ్యత తీసుకున్నారు. అప్పటికీ విజయానికి 42 బంతుల్లో 90 పరుగులు కావాలి. ఆ దశలో షెపర్డ్ ఓవర్లో నేహల్ వధేరా(15)లాంగాఫ్‌లో భారీ సిక్సర్ బాదాడు. అనంతరం హేజిల్‌వుడ్ వేసిన 16 వ ఓవర్లో స్లో బాల్‌ను శశాంక్ సింగ్(61 నాటౌట్ ) అలవోకగా స్టాండ్స్‌లోకి పంపాడు. చివరి బంతిని కూడా సిక్సర్‌గా మలవడంతో వరుసగా రెండు ఓవర్లలో 13 రన్స్ వచ్చాయి. ఐదో వికెట్‌కు 38 రన్స్ జోడించిన నేహల్‌ను భువీ ఔట్ చేసి.. మార్కస్ స్టోయినిస్(6)ను కూడా వెనక్కి పంపి ఆర్సీబీని పోటీలోకి తెచ్చాడు. అజ్మతుల్లా ఒమర్‌జాయ్(0)ను దయాల్ డకౌట్ చేయగా పంజాబ్ ఓటమి అంచున నిలిచింది. చివరి రెండు ఓవర్లలో 42 రన్స్ అవసరం కాగా.. శశాంక్ సింగ్(0) సిక్సర్లతో చెలరేగాడు. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో 6, 4, 6, 6 బాది అర్ధ శతకం సాధించాడు. కానీ, ఆర్సీబీ 6 పరుగుల తేడాతో ఛాంపియన్‌గా అవతరించింది.

### మెరిసిన కోహ్లీ

ఐపీఎల్ 18వ సీజన్ ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు తడబడ్డారు. పంజాబ్ కింగ్స్ పేసర్ కైలీ జేమీసన్(3-48), అర్ష్‌దీప్ సింగ్(3-40)లు విజృంభించడంతో పెద్ద స్కోర్ చేయలేకపోయారు. డేంజరస్ ఫిల్ సాల్ట్(16)విఫలం కాగా.. రజత్ పాటిదార్(26)ను ఔట్ చేసిన జేమీసన్ బెంగళూరును దెబ్బకొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా విరాట్ కోహ్లీ(43) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో జితేశ్ శర్మ (24), ధనాధన్ ఆడాడు.

జేమీసన్ వేసిన 17వ ఓవర్లో.. రెచ్చిపోయిన జితేశ్ మూడు సిక్సర్లతో 23 రన్స్ పిండుకున్నాడు. అతడి మెరుపులతో ఆర్సీబీ స్కోర్ 170కి చేరుకుంది. మరో మూడు ఓవర్లు ఈ ఇద్దరూ నిలబడితే 200 ప్లస్ ఖాయం అనిపించింది. కానీ, జేమీసన్ ఓవర్లో లివింగ్‌స్టోన్ ఔట్ కాగా.. ఆ తర్వాత జితేశ్‌ను విజయ్‌కుమార్ బౌల్డ్ చేసి ఆర్సీబీ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. అయితే.. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో రొమారియో షెపర్డ్(17) వరుసగా 4, 6 బాదాడు. కానీ, అర్ష్‌దీప్ చివరి ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయడంతో ఆర్సీబీ 190కే పరిమితమైంది.

# అట్టహాసంగా ఐపీఎల్ ముగింపు వేడుకలు

త్రివర్ణ శోభితమైన స్టేడియం

**అహ్మదాబాద్:** ఐపీఎల్ 18వ సీజన్ ముగింపు వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మరికాసేపట్లో ఫైనల్ జరుగనున్నందున అహ్మదాబాద్‌లోని నరేంద్రమోడీ స్టేడియం త్రివర్ణ శోభితమైంది. 'ఆపరేషన్ సిందూర్'కు ప్రతీకగా గగనతలంపై వైమానిక దళాలు మువ్వన్నెల జెండాను ప్రదర్శిస్తూ అభిమానుల్లో జోష్ నింపాయి. స్వరమాంత్రికుడు శంకర్ మహదేవన్ బృందం సైతం దేశభక్తి పాటలతో స్టేడియాన్ని హెూరెత్తిస్తున్నారు.

సాయంత్రం 6 గంటల నుంచి మహదేవన్, ఆయన కుమారులు భారత సైనికుల కీర్తిని చాటే గేయాలను ఆలపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నారు. నత్యకారులు సైతం మూడు రంగుల దుస్తులు ధరించి స్టెప్పులు వేస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇక స్టేడియంలోని అభిమానులు అయితే.. జాతీయ పతాకాన్ని చేతబూని.. జై హింద్, జై భారత్




నినాదాలతో సందడి చేస్తున్నారు.

### 200 ప్లస్ స్కోర్..

ఐపీఎల్ ఫైనల్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొన్ని గంటల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య అహ్మదాబాద్‌లో మెగా ఫైట్ జరుగనుంది. రెండింటో ఎవరు గెలిచినా కొత్త ఛాంపియన్ అవతరించినట్టే. సో.. విజేతగా నిలిచేది ఎవరు? అనేది అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఈ సమఉజ్జీల పోరాటంలో 200 ప్లస్ స్కోర్ నమోదవ్వడం ఖాయం అనిపిస్తోంది.

ఎందుకంటే.. క్వాలిఫయర్ 2లో ముంబై ఇండియన్స్ 203 రన్స్ కొట్టింది. భారీ ఛేదనలో శ్రేయాస్ అయ్యర్ మెరుపు హాఫ్ సెంచరీతో పంజాబ్ 11 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు దూసుకెళ్లింది. అటు ఆర్సీబీకి ఇది నాలుగో ఫైనల్. కాబట్టి.. కప్ ముద్దాడేందుకు.. ఛాంపియన్ అనిపించుకునేందుకు ఇరుజట్ల ఆటగాళ్లు ప్రాణం పెట్టి ఆడాల్సి ఉంటుంది.

# గ్లామరస్‌గా నటిస్తే తప్పేంటి..?

**మాళవిక మీనన్**

టాకీస్: సినిమాల్లో గ్లామరస్ గా నటిస్తే తప్పేంటని మలయాళ నటి మాళవిక మీనన్ ఎదురు ప్రశ్నిస్తోంది. ఇటీవల సోషల్ మీడియాలో గ్లామరస్ ఫొటోలు షేర్ చేస్తూ యువతకు నిద్ర లేకుండా చేస్తున్న మాళవిక.. తనపై నెగెటివ్ ప్రచారం చేసే వారిని పట్టించుకోనని చెప్పింది. ఎక్స్ పోజింగ్ విషయంలో చాలామంది హీరోయిన్లు ఉదారంగా ఉంటున్నారని తెలిపింది. తాను ఒక్కదాన్నే గ్లామర్ గా నటించడంలేదని, మిగతా హీరోయిన్లు కూడా బాడీ షో చేస్తున్నారని గుర్తుచేసింది. తమిళ, మలయాళ భాషల్లో చిత్రాలతో బిజీగా ఉన్న మాళవిక కోలీవుడ్‌లోనూ అవకాశాలు అందిపుచ్చుకుంటోంది. తెలుగులో 'అమ్మాయిలు అంతే అదో టైపు', 'వందనం' వంటి చిత్రాల్లో నటించినా పెద్దగా ఫేమ్ రాలేదు. దీంతో, ఓవైపు తెలుగు ఇండస్ట్రీలో అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే మలయాళ ఇండస్ట్రీపై మాళవిక ఫోకస్ పెట్టింది. తన ఇన్ స్టాలో మాళవిక షేర్ చేస్తున్న ఫొటోలు వైరల్ గా మారుతున్నాయి. ఈ ఫొటోలు చూసి నెటిజన్లు నటిపై ఫైర్ అవుతున్నారు. అవకాశాల కోసమే ఇలా ఎక్స్ పోజ్ చేస్తున్న ఫొటోలను షేర్ చేస్తోందని కామెంట్లు పెడుతున్నారు. ఈ కామెంట్లపై మాళవిక తాజా ఇంటర్వ్యూలో స్పందించింది. 'అవకాశాల కోసమే ఫొటోలు షేర్ చేయడం లేదు. అయినా గ్లామర్‌గా నటించడం లో తప్పేముంది. నా గురించి ఉన్నవీ లేనివీ ప్రచారం చేసే వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం నాకు లేదు. నాలాగే చాలామంది హీరోయిన్లు గ్లామర్ పాత్రల్లో నటిస్తున్నారు" అని చెప్పుకొచ్చింది.



## పవన్ అభిమానులకు మరో శుభవార్త

### త్వరలోనే ఉస్తాద్ భగత్‌సింగ్ షూటింగ్

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి టాలీవుడ్‌లో ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన సినిమాల కోసం అభిమానులు కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తుంటారు. అయితే రాజకీయాల వలన పవన్ కళ్యాణ్ సినిమాలు కాస్త తగ్గించాడు. దాదాపు రెండేళ్ల క్రితం మేనల్లుడు సాయి దుర్గా తేజ్ తో కలిసి 'బ్రో అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. జూలై 28, 2023లో ఈ విడుదల అయ్యింది. ఆ తరువాత మళ్ళీ స్క్రీన్ మీద కనిపించలేదు పవన్. అయితే 'హరి హర వీరమల్లు'తో ఈ నెల 12న థియేటర్లలోకి రానున్నారు. మరోవైపు తాను కమిట్ అయిన ఓజీ చిత్ర షూటింగ్ కూడా శరవేగంగా జరిగేలా ప్లాన్స్




చేసుకున్నారు పవన్ .ఇప్పటికే ఓజీ చిత్ర రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుందని ఇటీవలే పోస్టర్ ద్వారా తెలియజేశారు. ఇక పవన్ కమిటైన మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకి దీనిపై హరీష్ శంకర్ క్లారిటీ- ఇచ్చారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ దర్శకుడు హరీశ్ శంకర్ మంగళవారం ఉదయం విఐపి విరామం సమయంలో దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదశీర్వచనం అందించగా... ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ... జూన్ రెండవ వారంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సులు కోసం తిరుమలకు వచ్చామని హరీష్ తెలియజేయడంతో పవన్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 2న

## మై డియర్ శేఖర్.. మీలాంటి అభిమాని ఉండడం

# నాకూ ఆనందకరమే

### మెగాస్టార్ చిరంజీవి

### శేఖర్ కమ్ముల 25 ఏళ్ల సినీ ప్రస్థానంపై మెగాస్టార్ స్పందన

**టాకీస్:** ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల చలనచిత్ర రంగంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. చిరంజీవి సమక్షంలో ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరించారు. దీనిపై చిరంజీవి మంగళవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. శేఖర్ కమ్ములకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. "మై డియర్ శేఖర్, మీలాంటి ఒక అభిమాని ఉండటం నాకూ అంతే ఆనందకరం" అని చిరు పేర్కొన్నారు. శేఖర్ కమ్ముల ప్రస్థానానికి తాను స్ఫూర్తినిచ్చానని తెలుసుకోవడం తనకు మరింత సంతోషాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు.





శేఖర్ కమ్ముల 25 ఏళ్ల సినీ ప్రయాణంలో తాను కూడా ఒక భాగంగా ఉన్నందుకు గర్వంగా ఉందని చిరంజీవి తెలిపారు. శేఖర్ కమ్ముల చిత్రాల శైలిని ప్రశంసిస్తూ, "సున్నితమైన వినోదంతో పాటు, ఒక సోషల్ కామెంట్‌ను జత చేసి ఆలోచనాత్మకంగా తీసే మీ సినిమాలంటే నాకు ఎంతో ఇష్టం" అని చిరంజీవి అన్నారు. ఫిలిం మేకింగ్‌లో శేఖర్ కమ్ముల తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా శేఖర్ కమ్ముల మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, "ఇలాగే మరో 25 ఏళ్లు మరెన్నో జనరంజకమైన సినిమాలు రాస్తూ, తీస్తూ, మరెన్నో ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. అంతేకాదు, ఓ పెన్ ను కూడా శేఖర్ కమ్ములకు మెగాస్టార్ బహూకరించారు.

# లైగర్ బ్యూటీ.. పాస్ పోర్ట్ వెనక రొమాన్స్

టాకీస్: అసలు కలిసి పని చేస్తారో లేదో అనే సందేహాలు ఉన్నా, ఆ ఇద్దరూ తిరిగి ఒక ప్రాజెక్ట్ కోసం కలుస్తున్నారు. ఓ క్రేజీ రొమాంటిక్ కామెడీ కోసం సన్నాహకాలు కొద్ది రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. ఆసక్తికరంగా ఈ సినిమాలో ఔట్ సైడర్ సరసన ఇన్ సైడర్ హీరోయిన్ రొమాన్స్ చేస్తోంది. ఈ కథంతా ఓ ముగ్గురి గురించి... ఆ ముగ్గురు ఎవరు? అంటే.. కరణ్ జోహార్ - కార్తీక్ ఆర్యన్- అనన్య పాండే. కరణ్ జోహార్ పూర్తిగా ఇన్ సైడర్స్ కి మాత్రమే అవకాశాలు కల్పిస్తాడనే ఆరోపణలున్నాయి. అనన్య పాండే 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' చిత్రంతో అతడే వెండితెరకు పరిచయం చేసాడు. కానీ కార్తీక్ ఆర్యన్ ఔట్ సైడర్. పరిశ్రమలో నిలదొక్కుకునేందుకు ప్రతిభనే నమ్ముకున్నాడు. అతడు ఇంతింతై పెద్ద స్టార్ గా ఎదిగాడు. కొన్నేళ్ల క్రితం కార్తీక్ ఆర్యన్ తో ధర్మ ప్రొడక్షన్స్ లో 'దోస్తానా 2' చిత్రాన్ని ప్రారంభించిన కరణ్ జోహార్ మధ్యలోనే ఆ ప్రాజెక్టును వదిలేసాడు. దానికి కారణం కార్తీక్ ఆర్యన్ క్రమశిక్షణా రాహిత్యం అంటూ ఆరోపించాడు. ప్రాజెక్టు నుంచి కార్తీక్ ని తొలగించడమే గాక, అతడితో ధర్మ ప్రొడక్షన్స్ ఎప్పటికీ కలిసి పని చేయదని ప్రకటించాడు. కానీ కాలంతో పాటే మార్పు. ఇప్పుడు కరణ్ కోపం తగ్గింది. కార్తీక్ తో వివాదాల్ని పరిష్కరించుకున్నాడు. ఇన్ సైడర్ అనన్యను- ఔట్ సైడర్ కార్తీక్ ని కలుపుతూ కరణ్ జోహార్ ఒక రొమాంటిక్ కామెడీని తెరకెక్కించేందుకు సిద్ధమయ్యాడు. ఈ రొమాంటిక్-కామ్ టైటిల్ 'తు మేరీ మై తేరా మై తేరా తు మేరీ'. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో కార్తీక్ ఆర్యన్ రేగా .. బబ్లీ అనన్య పాండే రూమిగా నటించారు. ఈ చిత్రం నవ్వులు, ప్రేమ, కొంచెం అల్లరితో కూడిన అందమైన సన్నివేశాలతో సాగుతుందని కరణ్ బృందం ప్రకటించింది. తాజాగా రిలీజైన ఫస్ట్ లుక్ ఆకట్టుకుంది. పాస్‌పోర్ట్ పట్టుకుని కార్తీక్ అనన్యపై నుదిటి మీద ముద్దు పెట్టే స్నాప్‌షాట్ యువతరాన్ని ఆకర్షిస్తోంది. ఈ కథలో ప్రేమతో పాటు పాస్ పోర్ట్ డ్రామా కూడా ఉందని అర్థమవుతోంది. ఈ పాస్ పోర్ట్ తోనే ఏదో ఒక చిక్కు ఉంటుందని ఊహిస్తున్నారు. దీని నుంచి రోడ్ ట్రిప్ డ్రామా, రొమాన్స్ ని రాబట్టే ప్లాన్ వేసారు. నిజానికి ఇందులో కథానాయికగా శర్వరి వాఘ్ నటించాల్సి ఉన్నా, అనూహ్యంగా లైగర్ బ్యూటీ అనన్య పాండే ఆ ఛాన్స్ కొట్టేసింది.



# ప్రభాస్ అభిమానులకు ఇక పండగే

### 16న రాజాసాబ్ టీజర్ విడుదల

**టాకీస్:** ప్రభాస్ అభిమానులకు ఇక పండగే. త్వరలోనే శుభవార్త అంటూ వార్తలు వస్తున్నాయి. కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' భారీ అంచనాల మధ్య రానున్నది. ఈ మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మాణ సంస్థ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు తెలిపింది. అలాగే డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను పంచుకుంది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో



అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ దర్శకుడు మారుతీ పోస్ట్ పెట్టారు. 'మీ అందరకీ ప్రామిస్ చేసినట్లే మీరు కోరుకున్నట్లు- ప్రభాస్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తారు. ఆరోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి' అని క్యాప్షన్ పెట్టారు. మారుతి- ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. తమన్ ఇప్పటికే ఈ సినిమాలో నాలుగు పాటలు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వైవిధ్యమైన థీమ్స్‌తో వీటిని డిజైన్ చేసినట్లు వెల్లడించారు.

## 'కుబేర' నుంచి 'అనగనగా కథ' సాంగ్

**టాకీస్:** శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో వస్తున్న కుబేర ప్రమోషన్లలో జోరు పెంచేశారు. నాగార్జున, ధనుష్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. ఇప్పటికే భారీ ఈవెంట్ కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మూవీ గురించి చాలా విషయాలను పంచుకున్నారు. తాజాగా మూవీ నుంచి 'కుబేర' నుంచి 'అనగనగా కథ' సాంగ్ ను రిలీజ్ చేశారు. ఇందులో నాగార్జున, ధనుష్‌పైనే సాంగ్ సాగుతోంది. ఈ పాట ఒకింత ఆలోచించే విధంగానే కనిపిస్తోంది. రెండు




పాత్రల స్వభావాలను, వారి పరిస్థితులను ఇందులో వివరించబోతున్నారు. రష్మిక ఇందులో హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే వచ్చిన ట్రైలర్ బాగానే ఆకట్టు-కుంది. ఇందులో ధనుష్ పాత్ర ఇం-టె-స్టింగ్ గా ఉంది. శేఖర్ కమ్ముల సినిమా అంటేనే ఒకింత డిఫరెంట్ గా, భావోద్వేగాలను తట్టి లేపేవిగా ఉంటాయి. ఈ సారి కూడా అలాంటి భావోద్వేగాల నేపథ్యంలోనే మూవీని తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. అనగనగా కథ పాటను చంద్రబోస్ లిరిక్స్ అందించగా.. హైడ్ కార్తి, కరీముల్లా పాడారు. ఈ సినిమాలో నాగార్జున, ధనుష్ పాత్రలు చాలా డిఫరెంట్ గా ఉండబోతున్నాయి. వీరిద్దరి కాంబోలో వస్తున్న మొదటి మూవీ కావడంతో అటు తమిళంలో, ఇటు తెలుగులో ఆసక్తిని రేపుతోంది. వారం ముందు వీరమల్లు, వారం తర్వాత కన్నప్ప సినిమాలు రాబోతున్నాయి. అయినా సరే మూవీని భారీ పోటీ నడుమ రిలీజ్ చేస్తున్నారు.

## అంచనాలు పెంచిన రానా నాయుడు సీజన్ 2 ట్రైలర్..

**టాకీస్:** దగ్గుబాటి వెంకటేష్, రానా ప్రధాన పాత్రలలో రూపొందిన వెబ్ సిరీస్ రానా నాయుడు ఎంత పెద్ద సక్సెస్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు రానా నాయుడు సీజన్ 2 కోసం ఫ్యాన్స్ అందరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రానా నాయుడు సీజన్ 2కి సంబంధించిన ట్రైలర్ విడుదలైంది. ఇందులో వినోదం, థ్రిల్లింగ్ అంశాలు అంచనాలని పెంచేశాయి. 'రానా నాయుడు సీజన్ 2'లో నాగ నాయుడుగా వెంకటేష్ దగ్గుబాటి సందడి చేయనున్నారు. వెంకటేష్, నాగ నాయుడుకి చాలా తేడా ఉంటుంది. నాగ నాయుడు స్వార్థపరుడు, నియమాలను ఉల్లంఘిస్తుంటాడు. కానీ నిజ జీవితంలో వెంకటేష్ మాత్రం ఇలాంటి వాటన్నంటికీ దూరంగా ఉంటారు. రానా నాయుడు సీజన్ 2 మొత్తం యాక్షన్, డ్రామాతో నిండి ఉంటుంది. నాగ నాయుడు 2.0 పూర్తి స్థాయి ధమాకాను సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాడు. రానా నాయుడు సీజన్ 2 జూన్ 13 నుండి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న నేపథ్యంలో కొద్ది సేపటి క్రితం ట్రైలర్ విడుదల చేశారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.